

పన్ను బాదుడు

- పుర పౌరులపై ఆస్తి పన్ను భారం
- వరుసగా నాల్గవసారి పెరగనున్న వైనం
- పెరిగిన పన్ను అమలులోకి..
- మూడు జిల్లాల్లో ఆస్తి పన్ను భారం రూ.50 కోట్లు పైమాటే
- పన్ను చెల్లింపు దారుల నుంచి తీవ్ర వ్యతిరేకత





తాను అధికారంలోకి వస్తే అన్నీ పెంచు కుంటూ పోతానని ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్ అన్నారు. ఏ సంక్షేమ పథకాలో.. అభివృద్ధి పనులో అని ప్రజలు భావించారు. తీరా చూస్తే బస్సు.. కరెంటు ఛార్జీలను ఐదేళ్ల పాటు పెంచుకుంటూ పోయారు. ఆస్తి పన్ను, భూముల విలువ పెంచేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చెత్తపన్ను వసూలు చేశారు. ఆఖరికి ఖాళీ స్థలాల పైనా పన్ను వేసి జనాల నడ్డి విరగ్గొట్టారు. పెంచుకుంటూ పోతానంటూ ఆయన ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన మాటల్లో ఇంత అర్థం దాగి ఉందా అని పట్టణ వాసులు వాపోతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం పుర పౌరులపై మరోసారి ఆర్థిక భారం మోపింది. పన్ను పెరుగుదలకు హద్దే లేకుండా పోయింది. ఉన్న పన్నును 15శాతం పెంచేసింది. వరుసగా నాల్గవ ఏడాది పెంచింది. పెంచిన ఆస్తి పన్ను సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. ప్రభుత్వం బాదుడే బాదుడు అన్న నినాదాన్ని అమలు చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చెత్త పన్నుకు తోడు ఆస్తి పన్ను పెంపుదలపై పట్టణ వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా వీరి మొర ఆలకించే పాలకులే కరువయ్యారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పుర పౌరులపై దాదాపు రూ.50 కోట్ల ఆస్తి పన్ను భారం పడింది.

ఆస్తి పన్ను విషయంలో ప్రభుత్వ తీరు తగ్గేదేలే అన్న రీతిన జగన్ సర్కార్ వ్యవహరిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మునిసిపాల్టీలలో ఉన్న పన్ను విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఆస్తి మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా పన్నును విధిస్తోంది. దీని ప్రకారం ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేశారు. దీని ఆధారంగా ఆస్తి పన్ను ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అద్దె విలువ, మునిసిపాల్టీలో జోన్‌ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణనలోకి తీసుకునే వారు. మునిసిపాల్టీ గెజిట్ ప్రకారం జోన్‌ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనంకు మాత్రమే పన్ను విధించే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతో పాటు, ఒక వేళ భవనం చుట్టు ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధిస్తున్నారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయ వచ్చో మునిసిపాల్టీలలో నూతన ఆస్తి పన్ను విధానం తెలియ జేస్తోంది.

- ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటా పెరుగుతోంది. క్యాపిటల్ వాల్యూ ప్రకారం పన్ను నిర్ణయించిన సమయంలో గతంలో చెల్లిస్తు న్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారిస్తారు. తేడా ఉన్న పన్ను ఏటా 15శాతం పన్ను పెరుగుతోంది. మార్కెట్ విలువకు సమానం అయ్యేవరకు పన్ను ఆ మాదిరిగా పెరుగు తూనే ఉంటుంది. రూ.100 ఉన్న పన్ను రూ.115కు పెరగనుంది.

ఈ పన్నుల బాదుడు మునిసిపాల్టీలో ఆరంభమే కాని అంతం కాదని చెప్పవచ్చు. ఉదా హరణకు నరసరావుపేట మునిసిపా ల్టీలో పన్ను డిమాండ్ సుమారు రూ.8.59 కోట్లు దీని ప్రకారం 15శాతం పన్ను పెరగడంతో ఈ మున సిపాల్టీ ఆదాయం దాదాపు మరో రూ.1.28 కోట్లు వరకు పెరగనున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని అన్ని పురపాలక సంఘాలు, గుంటూరు కార్పొరేషన్‌లో రూ.35 కోట్లకు పైగా ఆస్తి పన్ను భారం ప్రజలపై భారం పడనున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. పన్నులు తగ్గించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోక పోతుండటంతో ప్రభుత్వంపై పన్ను దారులు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు.



- ఓ వ్యక్తి తన ఇంటికి ఏటా రూ.690 పన్ను చెల్లించే వాడు.. దీనికి ఏటా ప్రభుత్వం 15 శాతం చొప్పున పెంచేస్తోంది. వరుసగా నాల్గవ ఏడాది ఆస్తి పన్ను పెరుగుతోంది. ఇలా పెంచిన పన్నుతో రూ.690 పన్ను కాస్తా రూ.1210కి పెరిగింది. అంటే నాలుగేళ్లలో రూ.520 పన్ను పెరిగింది. పన్ను పెంపుదలతో పాటు చెత్త పన్ను భారం కూడా జనాలపై వేస్తున్నారు. ఒక్కో ఇంటికి నెలకు 60 చొప్పున సంవత్సరానికి రూ.720 చెత్తకు పన్ను వసూలు చేస్తున్న ఘనత జగనన్న సర్కార్‌కే దక్కడటం విశేషం. మధ్య తరగతి వర్గాలపై ప్రభుత్వం పన్నుల రూపంలో మోయలేని ఆర్థిక భారాన్ని మోపడంలో జగనన్న రికార్డు సృష్టించాడని చెప్పవచ్చు.



ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు..



చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడలేక మేము ఆందోళన చేపట్టాం. వేతనాలు పెరగడం మాటేమోగాని వచ్చే వేతనం కూడా ఆగిపోయింది. సమ్మెకాలానికి సంబంధించి 42 రోజుల జీతం ఆగిపోవడంతో మేమేం చేయాలి. మా కష్టాలు మరింత పెరిగాయి. ఆర్థికంగా చితికిపోతున్నాం.

\- రేఖ, బాపట్ల జిల్లా కార్యదర్శి

- తిరిగి విధుల్లో చేరి రెండు నెలలైనా అందని జీతాలు

సమ్మె కాలానికి వేతనమేది?

- సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన ఉద్యోగులు
- నలభై రోజులకు పైగా సాగిన ఉద్యోగుల పోరాటం
- బెదిరించి, భయపెట్టి ఆందోళనను అడ్డుకున్న ప్రభుత్వం
- తొలగింపు ఆదేశాలతో ఉద్యమంపై ఉక్కుపాదం
- జీతాలు కూడా రాకపోవడంతో నిరాశలో ఉద్యోగులు

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన అంగన్వాడీ ఉద్యోగులకు సమస్యల పరిష్కారం మాటెలా వున్నా వేతనాలు కూడా దక్కని పరిస్థితి వచ్చి పడింది. సమ్మె విరమించి ఇప్పటికి రెండునెలలు పూర్తయినా సమ్మెకాలానికి సంబంధించి వారికి రావాల్సిన వేతనాలు ఈరోజు వరకూ వారికి దక్కలేదు. ఇదుగో.. అదిగో అంటూ రెండు నెలలుగా నెట్టుకొచ్చిన ప్రభుత్వం వారికి వేతనాలు ఇవ్వలేక పోయింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వారికి వేతనాలు వస్తాయా? రావా? అన్న ఆందోళనలో ఉద్యోగులు అల్లాడిపోతున్నారు.

సమస్యల మాటేమోగానీ..

అంగన్వాడీ కేంద్రాలను ఏళ్లకేళ్లుగా వేధిస్తున్న సమస్యల పరిష్కారం కోసం, కనీస వేతనాల కోసం అంగన్వాడీ ఉద్యోగులు కిందటేడాది డిసెంబరు 8న సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చర్చలకు పిలవడంతో దాన్ని డిసెంబరు 12 వరకూ వాయిదా వేసుకున్నారు. చర్చల్లో ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో విధిలేని పరిస్థితిలో డిసెంబరు 12న సమ్మెకు దిగారు. ఆరోజు నుంచి ఈ ఏడాది జనవరి 23 వరకూ ప్రభుత్వం, అధికారులు ఎన్ని రకాలుగా భయపెట్టినా, బెదిరించినా, ఎస్మా ప్రయోగించినా వెరువక 42రోజులపాటు సమ్మె చేశారు. ఉద్యమ క్రమంలో చర్చల పేరుతో ఉద్యోగులను పిలిచినా ఒక్క సమస్యపై కూడా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో ఉద్యమం అంతకంతకూ పెరిగిపోయింది. ఉద్యోగులు ఎంతకీ లొంగి రాకపోవడంతో ప్రభుత్వం ఉద్యోగుల తొలగింపుకు ఆదేశాలు జారీ చేసింది. వాటిని కూడా ఉద్యోగులు లెక్క చేయక తమ ఆందోళనను కొనసాగించారు. ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులు ఇళ్లకే పంపించారు. దీంతో ఉద్యోగులు అర్థంతరంగా తమ ఆందోళనను విరమించాల్సి వచ్చింది. ఆ తరువాత ప్రభుత్వం మరోమారు చర్చలకని పిలిచినా 2024 జూన్‌లో ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరుపుతామని చెప్పింది. సమ్మె కాలానికి వేతనం ఇస్తామన్న హామీ లభించడం మినహా ఉద్యోగులకు ఏ ఒక్క హామీ కూడా దక్కలేదు. కానీ ఇప్పుడు ఆ హామీ కూడా అమలుకు నోచుకోలేదు.

రెండు నెలలుగా సాచివేత

అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె విరమించి ఇప్పటికి రెండు నెలలు దాటిపోయింది. ఈ ఏడాది జనవరి 23న వారు సమ్మె విరమించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ వారికి సమ్మెకాలం 42 రోజులకు సంబంధించిన వేతనం మాత్రం దక్కలేదు. వేతనం మీదే ఆధారపడే చిరుద్యోగులు కావడంతో వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం 14,500 కంటే మూడు వేలు తక్కువ జీతం, నెలకు 11,500తో సరి పుచ్చుకుంటున్న వారికి 42 రోజుల జీతం ఆగిపోవడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులయింది. జీతాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం మాత్రం దక్కలేదు. ఇదిలా కొనసాగుతుండగానే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో వారికి జీతాలు ఎప్పుడు అందుతాయనేది సమాధానం లేని ప్రశ్నగా మారింది.

రెండు నెలలైనా జీతాలు రాలేదు:

సమ్మె విరమణ చేసి రెండు నెలలైనా ఇప్పటి వరకూ జీతాలు పడలేదు. ప్రభుత్వం ఎంతో నమ్మకంగా సమ్మెకాలానికి జీతాలు ఇస్తామని చెప్పింది. అవేవీ ఇవ్వకుండానే రెండు నెలలు కాలం గడిపేసింది. ఇది కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని మాకు అనుమానం కలుగుతోంది.



\- దీప్తి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల కోడ్ వచ్చాక జీతాలు పడతాయా?:

ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కూడా అమలులోకి వచ్చింది. ఇక జీతాలు వస్తాయా అనేది అనుమానమే! ప్రభుత్వం ముందుగానే అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె కాలపు జీతాలు ఇవ్వాలి. కావాలనే ఎన్నికల కోడ్ వరకూ తాత్సారం చేసింది.



మెటిల్డా, పల్నాడు జిల్లా అధ్యక్షురాలు



- సుల్తానాబాద్‌లో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న నాదెండ్ల మనోహర్

3న తెనాలికి పవన్‌కల్యాణ్

- జనసేనాని పర్యటన విజయవంతం చేస్తాం
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన నాదెండ్ల మనోహర్

తెనాలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి ఈ నెల 3న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెనాలి రానున్నారని ఆ పార్టీ పీఏసీ చైర్మన్, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పవన్‌కల్యాణ్ పర్యటన, బహిరంగ సభను ఒక పండుగలాగా విజయవంతం చేస్తామన్నారు. పవన్ పర్యటనకు సంబంధించి ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను సోమవారం మనోహర్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్యేక హెలికాప్టర్‌లో సుల్తానాబాద్ చేరుకునే పవన్ వారాహి వాహనంలో తెనాలిలో పర్యటిస్తారన్నారు. తర్వాత సాయంత్రం 6 గంటలకు మార్కెట్ సెంటర్‌లో జరిగే సభలో పాల్గొంటారన్నారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను మనోహర్ కోరారు. తాము అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించిన ఉమ్మడి మ్యానిఫెస్టోను సభలో ప్రజల ముందుంచుతారని తెలిపారు. రైతులు, కౌలు రైతులు, నిరుద్యోగులు, ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి చేపట్టబోయే పరిష్కారాలను కూడా ప్రస్తావిస్తారన్నారు. ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీకి ఎక్కువ వాహనాలకు అనుమతివ్వడం, కూటమి అభ్యర్థులకు తక్కువ వాహనాలకు అనుమతులు ఇస్తూ వివక్ష చూపే అధికారులను ఎన్నికల సంఘం చూసుకుంటుందన్నారు.

జంగా.. రాజీనామా



వైసీపీకి రాజీనామా చేసిన పత్రాలను చూపుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

- వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష పదవికి..
- నేటి రాజకీయాలు వ్యాపారాలుగా మారాయి
- సామాన్యుడు రాజకీయాల్లో కొనసాగటం ఇబ్బందికరంగా మారింది
- 2019లో గురజాల సీటును కాసు మహేష్‌రెడ్డి కోసం త్యాగం చేశా
- ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

7లో..

తమ్ముళ్లలో.. సమరోత్సాహం

- చంద్రబాబు ప్రజాగళం సభ సక్సెస్
- మాజీ ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ
- నేతలతో బస్సులో సమావేశమై దిశానిర్దేశం
- అధినేతకు వీడ్కోలు పలికిన టీడీపీ శ్రేణులు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్ల పర్యటన విజయవంతమైంది. సమస్యలను ఎత్తి చూపడంతో పాటు వాటి పరిష్కారం విషయంలో స్పష్టమైన హామీని ఇవ్వడంతో పాటు బాపట్ల ప్రజలకు నేనున్నా అనే సంకేతాన్ని గట్టిగా వినిపించారు. ప్రజాగళం సభ సక్సెస్ అవడం ద్వారా టీడీపీ శ్రేణులు సమరోత్సాహంతో ఉన్నాయి. ఆదివారం రాత్రి ప్రజాగళం సభ ముగిసిన అనంతరం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస చేసిన చంద్రబాబు సోమవారం ఉదయం నేతలతో సమీక్షించారు. ఈ క్రమంలో చంద్రబాబు సమక్షంలో బాపట్ల నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ జన్నపు రెడ్డి సుబ్బారావు టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. పలు సమస్యలపై వినతులు అందించడానికి చంద్రబాబు బస చేసిన బస్సు వద్ద పలువురు క్యూ కట్టారు. అందరి సమస్యలను విన్న టీడీపీ అధినేత అధికారంలోకి రాగానే అన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉదయం 11 గంటల సమయంలో హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు చంద్రబాబు తిరుగు పయనమయ్యారు. ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టి పాటి రవికుమార్, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మలతో పాటు పెద్దసంఖ్య లో వచ్చిన పార్టీ శ్రేణులు చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు పలికారు.



విధ్వంసాన్ని వివరించాలి..

బాపట్ల లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల అభ్యర్థులతో టీడీపీ అధినేత చంద్రబాబు రెండు పర్యాయలుగా సమావేశమయ్యారు. తొలుత ఆదివారం రాత్రి నాయకులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు భవిష్యత్ కార్యాచరణపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం ఉదయం నేతలతో సమావేశమై ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇదే సమయంలో గెలుపుపై అతి విశ్వాసం వద్దన్నారు. గ్రామ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమని, వారి సేవలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని నేతలకు సూచించారు. బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ గతంలో ఎన్నో ప్రాజెక్టుల్లో తనదైన ముద్ర వేశారని, ఆయన ఐపీఎస్‌గా అందించిన సేవలను కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పదవులు మొదలుకుని అన్ని విషయాల్లో తమకు అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ఓరుగంటి రెడ్లు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఓరుగంటి రెడ్ల సంక్షేమం కోసం టీడీపీ కట్టుబడి ఉందని తెలపడంతో పాటు వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను అధికారంలోకి రాగానే ఏర్పాటు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చా రు. ఈ నేపథ్యంలో ఓరుగంటి రెడ్డి సం ఘం నాయకులు సోమవారం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ భద్రత లేక బాధలు పడుతున్నామని, కనీస సౌకర్యాలు కూడా అందడం లేదని బాపట్ల జిల్లా విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చంద్రబాబుకు వినతి పత్రం అందించారు. అధికారంలోకి రాగానే తమను పర్మినెంట్ చేసి న్యాయం చేయాలని వారు అందులో పేర్కొన్నారు.

విదేశీ విద్యను దూరం చేశారు..

విదేశీ విద్యకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందక బాధితులుగా మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం చంద్రబాబును కలిసి న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చిన బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో విదేశీ విద్యాధారణ, అంబేద్కర్ విదేశీ విద్య పేరిట స్కాలర్‌షిప్‌లు అందించి పేదలకు ఎంతో అండగా నిలిచారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం 26 జిల్లాల్లోని 359 మంది పేద విద్యార్థులకు విదేశీవిద్యసాయం అందక అల్లాడిపోతున్నారని వివరించారు. అధి కారంలోకి రాగానే అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

- నవులూరులో లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఆదెపు శివనాగేశ్వరరావు కుటుంబ సభ్యులు



అభివృద్ధే లక్ష్యం.. ఆశీర్వదించండి

మంగళగిరి, ఏప్రిల్ 1: మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధితో మీ ముందుకు వచ్చా.. ఆశీర్వదించి ఈ అభివృద్ధి యజ్ఞంలో సహకారం అందించాలి.. అని యువనేత నారా లోకేశ్ కోరారు. పలువురు తటస్త ప్రముఖులను సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత నవులూరులోని వ్యాపారవేత్త, మంగళగిరి ఆటోనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదెపు శివనాగేశ్వరరావును కలిశారు. చేనేతవర్గ సమస్యలను ఆయన లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. చేనేతలను ఆదుకునేందుకు మంగళగిరిలో తాను పైలెట్ ప్రాజెక్టుగా ఆరంభించిన వీవర్స్‌శాల మంచి ఫలితాలను ఇస్తుందని లోకేశ్ చెప్పారు. చేనేత ఉత్పత్తులకు జీఎస్టీనుంచి పూర్తి ఉపశమనం తీసుకురావాలన్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నానన్నారు. చేనేతలకు రెండొందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇస్తామని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించిన సంగతిని ఆయన గుర్తుచేశారు.

ఎన్నికల శిక్షణకి హాజరుకావాలి

- జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 1: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శిక్షణా కార్యక్రమానికి సంబందిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో సోమవారం ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల శిక్షణ సమాచారాన్ని సంబంధిత రిటర్నింగ్ అధికారులు పోలింగ్ పర్సనల్స్ కి తెలియజేయాలన్నారు. పోలింగ్ పర్స నల్స్ అందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన ఫామ్ - 12 ని ఫిల్ చేసి శిక్షణ కు వచ్చేలా వారికి ఆర్‌వోలు స్పష్టంగా తెలపాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి శిక్ష ణ కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయా అనేది ఆర్‌వోలు పరిశీలన చేయాలన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(మంగళవారం)
సహారీ (ఉదయం) 4.45 (బుధవారం)

దిక్సూచి DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



జమిలి ఎన్నికలు అనుకూల - ప్రతికూల వాదనలు

(నిన్నటి దిక్సూచి తరువాయి)

అనుకూల వాదనలు

1. మూడుస్థాయిల్లోని ప్రభుత్వాలకు విడివిడిగా ఎన్నికలు నిర్వహించేకన్నా, ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం మంచిది. తద్వారా ఎన్నికల నిర్వహణకు మూడుసార్లు అయ్యే అనేక ఖర్చులు తగ్గుతాయి. దేశంపై ఆర్థికభారం తగ్గుతుంది. ఇది ప్రభుత్వంతోపాటు రాజకీయ పార్టీలకు, వాటికి నిధులిచ్చే వాణిజ్య సంస్థలకు భారం తగ్గిస్తుంది.
2. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది మొదలు, పూర్తయ్యేవరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుంది. ప్రభుత్వాలు దైనందిన పాలనా కార్యక్రమాలు మినహా, కొత్త పథకాలు/ కొత్త విధానాలు చేపట్టడానికి అవకాశం ఉండదు. రెండు మూడు నెలలపాటు ఈ పరిస్థితి నెలకొంటుంది. ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు ఒక్కోసారి లోక్‌సభ ఎన్నికలు కూడా జతయై సంవత్సరంలో సగంరోజుల పాటు ఈ క్రియాశూన్యత కనిపిస్తూ ఉంటుంది. జమిలి ఎన్నికలతో అయిదు సంవత్సరాలకు ఒకసారి కొన్ని నెలలకే దీనిని పరిమితం చేయవచ్చు.
3. మానవ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. ఎన్నికల సమయంలో భారీఎత్తున భద్రతా బలగాల తరలింపు, ప్రభుత్వాధికారులకు అదనపు పని ఒత్తిడి ఉంటుంది. జమిలి ఎన్నికల వల్ల వారిపై ఈ భారం ఒక్కసారికే పరిమితం అవుతుంది.
4. తరచూ, ఏదో ఒక స్థాయిలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు నాయకులు నిరంతరం గెలుపు కోసం ప్రచారాలు, వ్యూహరచనలు చేయడంలో నిమగ్నమైపోతారు. ప్రజా సంక్షేమానికి పనిచేసే సమయం ఉండదు. అందువల్ల ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల చేతుల్లోంచి ప్రభుత్వోద్యోగుల చేతుల్లోకి పాలన వెళ్లి అది ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నిస్తుంది.
5. అన్ని స్థాయిల్లో ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల దేశవ్యాప్త అంశాలపై ఎక్కువగా చర్చ జరిగి జాతీయ దృక్పథం అలవడుతుంది. సంకుచిత ప్రాంతీయవాద ఓటుబ్యాంకు రాజకీయాలకు తెరపడి, దేశ సమైక్యతకు, సమగ్రతకు తోడ్పడుతుంది.
6. తాత్కాలికంగా ఎన్నికల కోసం వైరుధ్య సిద్ధాంతాలున్న పార్టీలు అసంబద్ధ పొత్తులు పెట్టుకోవడం జమిలి ఎన్నికలతో తగ్గుతుంది. సిద్ధాంతపరమైన నిజాయితీకి పార్టీలు కట్టుబడతాయి.
7. పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యేల బుజ్జగింపులు వంటివి తగ్గి పాలనలో స్థిరత్వం పెరిగి పాలకులు పాలనపై దృష్టిపెట్టడానికి అవకాశం ఉంటుంది.
8. ఏవైనా కఠిన నిర్ణయాలు ప్రజాసంక్షేమం దృష్ట్యా తీసుకోవాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వాలు నిర్భీతిగా వ్యవహరించవచ్చు. అయిదేళ్లకు గానీ ఎన్నికలు మరలా రానందున పదే పదే ప్రజాకర్షక ఉచిత పథకాలు వంటివి ప్రకటించాల్సిన అవసరం రెండు స్థాయిల్లోని అధికార పార్టీలకు ఉండదు. ఫలితంగా పెద్దఎత్తున ప్రజాధనం నిర్మాణాత్మక కార్యక్రమాలకు మళ్లుతుంది.
9. జమిలితో ఒకేసారి అన్నిస్థాయిల ఎన్నికల్లో ఓటు వేసే సౌలభ్యం ఉంటుంది. ఓటుహక్కు వినియోగించుకోవాలనే నైతిక ఒత్తిడి కూడా ప్రజలపై ఉండి ఓటింగ్ శాతం పెరుగుతుంది.
10. ఓటర్ల జాబితాలో సవరణలు పదేపదే చేయాల్సిన అవసరం ఎలక్షన్ కమిషన్‌కు ఉండదు. ఓటర్లు కూడా తమ ఓటుహక్కును తరచూ తనిఖీ చేసుకోవాల్సిన శ్రమ ఉండదు.
11. ఎన్నికల సమయంలో మత, సైద్ధాంతిక, ప్రాంతీయపరమైన ఉద్రిక్తలు పార్టీల ప్రయోజనాల కోసం రెచ్చగొడుతూ ఉంటారు. ఇటువంటివి తగ్గుతాయి.

ప్రతికూల వాదనలు

1. దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించడం అంటే పెద్దఎత్తున రవాణా, ఎన్నికల సామగ్రి అవసరమవుతుంది. ఉదాహరణకు ఇప్పుడున్న ఈవీఎంలకు రెండింతలు ఈవీఎంలు అవసరమవుతాయి. భద్రతా దళాల, మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. ఈవీఎంల భద్రత కూడా ప్రశ్నార్థకం అవుతుంది. శాంతిభద్రతలు అదుపుతప్పినప్పుడు వెంటనే కట్టడి చేయడం కష్టం.
2. భారతదేశ జనాభాలో సాంకేతిక అవగాహన లేనివారు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఒకేసారి మూడు నాలుగు ఈవీఎంలను వినియోగించాలంటే వీరు గందరగోళపడి తప్పులు జరగడానికి అవకాశం ఉంది. తదుపరి ఎన్నికలప్పుడు అసలు ఓటు వేయడానికే వీరు ఉత్సాహం చూపకపోవచ్చు.
3. విడివిడిగా ఎన్నికలు జరిగినప్పుడే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులపై ప్రత్యేకంగా ప్రజలు దృష్టి సారించడానికి వీలవుతుంది. ఒకేసారి ఎన్నికలు జరిగినప్పుడు జాతీయస్థాయి చర్చే ప్రధానంగా జరిగి రాష్ట్రాల్లో కూడా జాతీయ పార్టీల ప్రభావం పడే అవకాశం ఉంది. లేదా ప్రాంతీయ పార్టీల వల్ల వర్గ, మత, ప్రాంతీయ అభిమాన ప్రభావాలకు ప్రజలు గురైనప్పుడు వాటికి అనుగుణంగా ఉన్న జాతీయ పార్టీల వైపు మొగ్గు ఏర్పడుతుంది. ఏతావతా ఆయా ప్రభుత్వాల పనితీరు విస్మరించబడుతుంది.
4. ఏదో ఒక ఎన్నికలు ఉండటం వల్ల ప్రభుత్వాలు జాగరూకతతో ఉంటాయి. లేకుంటే నియంతృత్వ పోకడలకు అవకాశం ఉంది.
5. నిధులు సమకూర్చుకోవడంలో, ఎన్నికల ఖర్చులో జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడలేవు. అందువల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికి ప్రమాదం ఏర్పడి ప్రాంతీయ సమస్యలు, ఆకాంక్షలు గుర్తింపునకు నోచుకోవు. ఇది అశాంతికి దారితీస్తుంది.
6. జమిలి విధానంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ రద్దు, ముందస్తు ఎన్నికలను కోరే అధికారం కోల్పోతారు. కేవలం కేంద్ర ప్రభుత్వానికే ఎలక్షన్ సంబంధిత నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉండి సమాఖ్య లక్షణం ప్రశ్నార్థకమవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

నోటిఫికేషన్స్



ఏపీ పీజీసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి- పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీజీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌ను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు సహా ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ, మైనారిటీ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంసీజే, ఎం.లైబ్రరీ సైన్స్, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అలాగే తెలుగు రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రతి కోర్సులో 10 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు.

అడ్మిషన్స్ ఇచ్చే యూనివర్సిటీలు: ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, శ్రీ కృష్ణదేవరాయ, ఆచార్య నాగార్జున, శ్రీ పద్మావతి మహిళ, యోగి వేమన, రాయలసీమ, విక్రమ సింహపురి, ద్రవిడియన్, కృష్ణ, ఆది కవి నన్నయ, డా.బీ.ఆర్.అంబేద్కర్, డా.అబ్దుల్ హక్ ఉర్దు, క్లస్టర్, ఆంధ్ర కేసరి, జేఎన్‌టీయూఏ - ఓటీపీఆర్‌ఐ, స్విమ్స్-తిరుపతి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్నవారు కూడా అర్హులే. ఎంఏ ఎకనామిక్స్‌లో ప్రవేశానికి బీకాం అభ్యర్థులు; ఎంఏ(లాంగ్వేజెస్)లో ప్రవేశానికి బీఈ, బీటెక్, బీఫార్మసీ అభ్యర్థులు అనర్హులు.

ఏపీ పీజీ సెట్ 2024 వివరాలు: పీజీసెట్ 2024ను మూడు కేటగిరీల్లో నిర్వహిస్తారు. మొదటి కేటగిరీలో ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్; రెండో కేటగిరీలో కామర్స్, ఎడ్యుకేషన్; మూడో కేటగిరీలో సైన్సెస్ సంబంధిత సబ్జెక్టుల్లో పరీక్షలు ఉంటాయి.

- **మొదటి కేటగిరీ టెస్ట్‌లు:** ఇంగ్లీష్, జనరల్, తెలుగు, లిటరేచర్, సంస్కృతం, హిందీ, ఉర్దూ, తమిళం, బీఏ/ ఎంఏ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్, పర్ఫామింగ్ ఆర్ట్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, టూరిజం
- **రెండో కేటగిరీ టెస్ట్‌లు:** కామర్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్
- **మూడో కేటగిరీ టెస్ట్‌లు:** లైఫ్ సైన్సెస్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్సెస్, బోటనీ, సెరీకల్చర్, జువాలజీ, మేథమెటికల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్, ఫిజికల్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ సైన్సెస్, పాలిమర్ సైన్స్, జియాలజీ, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీ
- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.
- ఎంపీఈడీ కోర్సుకు మాత్రం అభ్యర్థులు క్రీడల్లో సాధించిన విజయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. దీనికి కూడా 100 మార్కులు కేటాయించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.850; బీసీ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.650
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 4
- **ఏపీ పీజీ సెట్ 2024 తేదీలు:** జూన్ 10 నుంచి 14 వరకు
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

సి పెట్ అడ్మిషన్ టెస్ట్

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)- అడ్మిషన్ టెస్ట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. వయో పరిమితి నిబంధనలు లేవు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. హైదరాబాద్ క్యాంపస్‌లో అన్ని ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ క్యాంపస్‌లో పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్ లేదు. మహిళలకు, పురుషులకు విడివిడిగా వసతి సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పాలిమర్స్, ప్లాస్టిక్స్, పెట్రోకెమికల్స్, మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ విభాగాలకు సంబంధించి ప్రొఫెషనల్/టెక్నికల్ ట్రెయినింగ్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా స్టయిపెండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌లు కూడా ఉంటాయి. ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: బీఎస్సీ ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తరవాత రెండేళ్ల వ్యవధిగల కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/ క్యామ్ (పీడీ-పీఎండీ-క్యాడ్/క్యామ్): ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. మూడు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: మూడేళ్ల డిప్లొమా(మెకానికల్/ప్లాస్టిక్స్/పాలిమర్/ టూల్/టూల్ అండ్ డై మేకింగ్/ప్రొడక్షన్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్-మెకట్రానిక్స్/ఆటోమొబైల్/పెట్రో కెమికల్స్/ ఇండస్ట్రియల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/టెక్నాలజీ) లేదా సిపెట్ నుంచి డీపీఎంటీ/డీపీటీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 వివరాలు: దీనిని కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. అర్హత కింద నిర్దేశించిన కోర్సు సిలబస్, జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్ కింద స్పోర్ట్స్, హిస్టరీ, పాలిటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. డీపీటీ, డీపీఎంటీ ప్రోగ్రామ్‌లకు నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 25, సైన్స్ సబ్జెక్ట్ నుంచి 20, ఇంగ్లీష్ నుంచి 5 ప్రశ్నలు అడుగుతారు. పీజీ డిప్లొమా ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలు; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు; కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, మేథ్స్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు ఇస్తారు. పోస్ట్ డిప్లొమాకు నిర్వహించే ఎగ్జామ్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 20; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10; ప్లాస్టిక్స్/పాలిమర్స్, టూల్స్ రూం, ఇండస్ట్రియల్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట. నెగెటివ్ మార్కులు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 తేదీ:** జూన్ 9
- **వెబ్‌సైట్:** https://cipet24.onlineregistrationform.org/CIPET/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/b8sZJaRలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

టిల్లు స్క్వేర్ చూసి ఎంజాయ్ చేశా



చిరంజీవి

ఇటీవల విడుదలై విజయం సాధించిన 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని చూసి మెగాస్టార్ చిరంజీవి బాగా ఎంజాయ్ చేశారు. వెంటనే ఆయన చిత్ర బృందాన్ని తన ఇంటికి పిలిపించుకొని ప్రత్యేకంగా అభినందించడం విశేషం. ఆయన ఆహ్వానంపై హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు మల్లిక్ రామ్, నిర్మాత నాగవంశీ చిరు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'ఒక సినిమా హిట్ అయి, దానికి సీక్వెల్‌గా మరో చిత్రం వస్తుంటే అంచనాలు భారీ స్థాయిలో ఉంటాయి. వాటిని అందుకోవడం అంత తేలికైన విషయం కాదు. కానీ హీరో సిద్ధు, దర్శకుడు మల్లిక్‌రామ్, నిర్మాత నాగవంశీ.. ఇతర టీమ్ అంతా కలసి ప్రేక్షకులు మెచ్చేలా 'డీజె టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్'ను అందించడంలో విజయం సాధించారు. అదే ఉత్కంఠ, అదే సరదా, అదే నవ్వుల జల్లు. నటుడిగా, కథకుడిగా వ్యవహరించి, ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి ప్రధాన కారణమైన సిద్ధును అభినందిస్తున్నాను.ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డామో, నిద్రలేని రాత్రులు ఎన్ని గడిపామో అని సిద్ధు నాతో చెప్పాడు. దర్శకుడు మల్లిక్ రామ్, ఎడిటర్ నవీన్ నూలి సహా అందరి సమష్టి కృషి ఉందని తెలిపాడు. విజయం సాధించిన దర్శకనిర్మాతలకు నా శుభాకాంక్షలు. 'మ్యాడ్' చిత్రంతో దర్శకుడిగా ఆకట్టుకొన్న కల్యాణ్ ఈ సినిమా రచనలో సహకారం అందించాడని విన్నాను. కేవలం యువతనే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా సినిమా తీశారు. ఈ సినిమా చూసి నేను బాగా ఎంజాయ్ చేశా. మీరు చేయండి' అన్నారు.

ఫ్యామిలీ ఆడియెన్స్ మెచ్చుకునేలా...

విజయ్ దేవరకొండ, మృణాల్‌ఠాకూర్ నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించారు. దిల్‌రాజు,శిరీశ్ నిర్మించారు. ఈ నెల 5న 'ఫ్యామిలీ స్టార్' విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ వేడుకకు నిర్మాత దిల్‌రాజు, విజయ్ దేవరకొండ సంప్రదాయ దుస్తుల్లో హాజరుకావడం విశేషం. దిల్‌రాజు మాట్లాడుతూ "ఫ్యామిలీ స్టార్ సినిమా విషయంలో ప్రతీ విషయంలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది. డైరెక్టర్ కథ చెప్పగానే అందులోని పాయింట్ నన్ను ఎక్సైట్ చేసింది. ఈ సినిమాకు విజయ్ క్యారెక్టర్ వెన్నెముక లాంటిది. ఇది 30 శాతం ఫ్యామిలీ స్టోరీ, 70 శాతం లవ్ స్టోరీ. మృణాల్ లక్కీ హీరోయిన్. ఈ చిత్రంతో తెలుగులో ఆమె హ్యాట్రిక్ అందుకుంటుంది" అని అన్నారు. విజయ్ మాట్లాడుతూ "మనకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి నేనున్నా అని చెప్పే వ్యక్తి ఫ్యామిలీలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. ఈ సినిమాకు, 'గీతాగోవిందం' సినిమాకు ఏ పోలిక ఉండదు. ఈ కథ వింటున్నప్పుడు మా నాన్న గుర్తొచ్చారు. అందుకే ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కి మా నాన్న పేరు గోవర్థన్ అని పెట్టాం" అని చెప్పారు. మృణాల్ మాట్లాడుతూ "సీతారామం, హాయ్‌నాన్న తర్వాత నా నెక్స్ట్ తెలుగు ప్రాజెక్ట్ కోసం చాలా కథలు విన్నా. ఈ సినిమా కథ నాకు నచ్చడంతో వెంటనే ఒప్పేసుకున్నాను. మన జీవితాల్లోని ఎమోషన్స్, రిలేషన్స్, అచీవ్‌మెంట్స్, స్ట్రగుల్స్ అన్నీ ఈ మూవీలో రిలేట్ చేసుకుంటారు" అని తెలిపారు.



కమల్ హాసన్ మెచ్చుకున్నారు



మలయాళ మూవీ ఇండస్ట్రీలో లేటెస్ట్ సెన్సేషన్ 'మంజుమ్మెల్ బాయ్స్'. మలయాళ బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లు కలెక్ట్ చేసిన మొట్టమొదటి సినిమాగా నిలిచింది. తమిళనాడులోని గుణ కేవ్స్‌లో జరిగిన ఓ వాస్తవ సంఘటన స్ఫూర్తితో చిదంబరం ఎస్ పొదువల్ దీనిని తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ ఏప్రిల్ 6న ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ చిదంబరం మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ మీద ముందు నుంచి అందరికీ నమ్మకం ఉంది. కానీ రూ.200 కోట్లు కలెక్ట్ చేస్తుందని ఎవరూ ఊహించలేదు. నా సెకండ్ సినిమా కథ కోసం అన్వేషిస్తుండగా గుణ కేవ్స్‌లో జరిగిన ఈ సంఘటన గురించి తెలిసింది. నన్ను ఈ కథ ఎంతగానో ఎక్సైట్ చేసింది. వెంటనే వర్క్ స్టార్ట్ చేసి, రియల్ లైఫ్ మంజుమ్మెల్ బాయ్స్‌ను కలిశా. వారు జరిగిందంతా చెప్పారు. విన్నాక ఇది ప్రజలకు తెలియాల్సిన కథ. సినిమా తీయాలి అని మరింత దృఢంగా నిశ్చయించుకున్నాను. సినిమా చూసిన కమల్ హాసన్ మెచ్చుకోవడం పెద్ద అవార్డు గెలుచుకున్నట్లనిపించింది. మలయాళీలకు తెలుగు సినిమాలు అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశిస్తున్నాను. తెలుగులో ఎంతో మంది మంచి నటులు ఉన్నారు. వారితో సినిమా చేసే అవకాశం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు.



'ఓ భామ అయ్యో రామ'



వైవిధ్యమైన చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన హీరోగా నటిస్తున్న మరో వైవిధ్యమైన ప్రేమకథా చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మాళవిక మనోజ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రామ్ గోదాల దర్శకత్వం వహిస్తున్నారు. హరీశ్ నల్లా, ప్రదీప్ తాళ్ల నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రాన్ని ప్రారంభించి టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ "దర్శకుడు మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు" అని తెలిపారు. 'నువ్వు నేను' ఫేమ్ నటి అనిత హస్సనందని మాట్లాడుతూ "నా సెకండ్ ఇన్నింగ్స్‌కు పర్ఫెక్ట్‌గా కుదిరిన చిత్రమిది" అని చెప్పారు. దర్శకుడు రామ్ గోదాల మాట్లాడుతూ "ఇదొక బ్యూటిఫుల్ లవ్‌స్టోరి" అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమాకు ప్రారంభం నుంచే మంచి పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, డైరెక్టర్స్ వశిష్ఠ, విజయ్ కనకమేడల, శైలేశ్ కొలను పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: భవిన్ ఎమ్.షా, సినిమాటోగ్రాఫర్: మణికందన్, సంగీతం: రథన్, కోప్రొడ్యూసర్: ఆనంద్ గడగోని.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/C5zBRWR లో చదవండి.

దర్శకుడు, అనువాద రచయిత శ్రీరామకృష్ణ కన్నుమూత



దర్శకుడు, అనువాద మాటల రచయిత శ్రీ రామకృష్ణ(74) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం క్షీణించటంతో సోమవారం రాత్రి 8 గంటలకు తేనాంపేటలోని అపోలో హాస్పిటల్‌లో కన్నుమూశారు. శ్రీరామకృష్ణ స్వస్థలం తెనాలి. 50 ఏళ్ల కిందట చెన్నైలో స్థిరపడ్డారు. ఆయనకు భార్య స్వాతి, కుమారుడు గౌతమ్ ఉన్నారు. ముంబై, జెంటిల్మన్, చంద్రముఖి తదితర 300 చిత్రాలకు పైగా అనువాద రచయితగా పనిచేసిన శ్రీ రామకృష్ణ.. 'బాలమురళీ ఎంఏ', 'సమాజంలో స్త్రీ' చిత్రాలకు దర్శకత్వం వహించారు. అనువాద రచనలో రాజశ్రీ తర్వాత తనకుంటూ ఒక ప్రత్యేకత ఏర్పరచుకున్న శ్రీరామకృష్ణ మణిరత్నం, శంకర్ దర్శకత్వం వహించిన అన్ని చిత్రాలకు తెలుగులో మాటలు రాశారు, రజనీకాంత్ 'దర్బార్' చిత్రానికి చివరిగా మాటలు అందించారు. ఆయన పార్థివదేహానికి మంగళవారం ఉదయం సాలిగ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని ఆయన కుమారుడు గౌతమ్ తెలిపారు.

చెన్నై(ఆంధ్రజ్యోతి)

6న వినుకొండకు చంద్రబాబునాయుడు

వినుకొండటౌన్, ఏప్రిల్1: ప్రజాగళం కార్యక్రమంలో బాగంగా ఈనెల 6 తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ్య అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వినుకొండలో పర్యటించనున్నట్లు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం తెలిపారు. కావున పార్టీ నాయకు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గురుకుల విద్యాలయ ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు(విద్య), చిలకలూరిపేట ఏప్రిల్ 1: గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగించినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాలయాల్లో 2024-25 సంవత్సరాల్లో 5వ తరగతి, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లు భర్తీ చేయడానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఏపీఆర్‌జేసీ(ఇంటర్), ఏపీఆర్‌డీసీ(డిగ్రీ) ద్వారా కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసే గడువు ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయాలి : ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, ఏప్రిల్1: సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నరేంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు అవతాత్తల పెన్షన్ల పేరుతో జగన్‌రెడ్డి సరికొత్త నాటానికి తెరతీసారన్ని ఎద్దేవా చేశారు. వలంటీర్లు మా సొంత కార్యకర్తలేనని విజయసాయి రెడ్డి, ధర్మాన ప్రసాదరావు బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో 15 వేల సచివాలయాల్లో 1,50,000 మంది సిబ్బంది ఉన్నారన్నారు. 60 లక్షల సామాజిక పింఛన్లు ఈ సిబ్బంది ద్వారా ఒక్కొక్కరికి 40 చొప్పున ఒక పూటలో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయించవచ్చన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘాన్ని చీఫ్ సెక్రటరీని తెలుగుదేశం బృందం కలిసి విన్నవించిన్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు : జీవీ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1: పింఛన్ల సొమ్ముతోపాటు ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు తన సొంత కాంట్రాక్టర్లకు జగన్‌మోహన్‌రెడ్డి దోచిపెట్టారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయలు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. తన దుర్మార్గాన్ని కప్పి పెట్టుకోవడానికి జగన్‌రెడ్డి ఎన్నికల కమీషన్ పైన, నిమ్మగడ్డ రమేష్ కుమార్‌పైన విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. పింఛన్ దారుల పట్ల వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే ఖజానాలో ఉన్న డబ్బును కాంట్రాక్టర్లకు దోచి పెట్టేవాడు కాదన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామ కార్యదర్శులతో ఫింఛన్లు పంపిణీ చేయించ లేకపోవడానికి జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించిన నిధులు కొరతే కారణమని, ఎన్నికల కమీషన్, తెలుగుదేశంపార్టీ కాదని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటివద్దకే నెలకు రూ.4 వేలు పెన్షన్ అందిస్తామని అన్నారు. పింఛన్ల పంపిణీ సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే చేయించాలని డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ.. రూ.12 లక్షలు స్వాధీనం

చిలకలూరిపేట, ఏప్రిల్ 1: జాతీయ రహదారిపై చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు జరుపుతుండగా ఒక కారులో తరలిస్తున్న రూ.12 లక్షలు నగదు పట్టుబడ్డాయి. పోలీసులు ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు నుంచి గుంటూరుకు వెళ్తున్న వారిలో ఈ మొత్తం దొరికింది. కారులో ప్రయాణం చేస్తున్న ప్రకాశం జిల్లా పెద్దచర్లపల్లి గ్రామానికి చెందిన తాళ్ళూరి తిమోతి అనే వ్యక్తి వద్ద నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వలంటీర్ల తొలగింపు

దాచేపల్లి, ఏప్రిల్ 1: గామాలపాడులో ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో వెంకటరమణ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ సిలార్‌బాషా రాజకీయ పార్టీల నాయకులను ఉద్దేశించి పోస్టులు పెడుతూ పింఛన్ తీసుకునే వారిని భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. బైరపోగు వినయ్ అనే వలంటీర్ రాజకీయ పార్టీల ఫంక్షన్లకు హాజరుకావడంతో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నట్లుగా భావించి విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

జంగా.. రాజీనామా

- వైసీపీ సభ్యత్వానికి, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష పదవికి..
- నేటి రాజకీయాలు వ్యాపారాలుగా మారాయి
- సామాన్యుడు రాజకీయాల్లో కొనసాగటం కష్టంగా ఉంది
- 2019లో గురజాలను కాసు మహేష్‌రెడ్డి కోసం త్యాగం చేశా ● ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, ఏప్రిల్ 1: వైసీపీ నాయకులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులోని జంగా కృష్ణమూర్తి స్వగృహంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకుల మధ్య రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. జంగా మాట్లాడుతూ 2019లో గురజాల నియోజకవర్గ సీటును కాసు మహేష్‌రెడ్డి కోసం త్యాగం చేశానని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించిన నెలకే గురజాల నియోజక వర్గంలోని పిడుగురాళ్ల నుంచి ప్రజలతో కలిసి హైదరాబాద్‌లోని గాంధీభవన్ వరకు రాజశేఖర్‌రెడ్డికి భారతరత్న అవార్డు ఇవ్వాలని, జగన్మోహన్‌రెడ్డికి సీఎం పదవి ఇవ్వాలని పాదయాత్ర చేశానన్నారు. వైసీపీ నిర్మాణ కమిటీలో పబ్లిసిటీ కార్యదర్శిగా పని చేశాను. సీఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీ పెట్టకముందు నుంచి ఆయనతో కలిసి ప్రయాణం చేసిన పది మందిలో నేనొకడిని. కానీ పదవు లిస్తేనే సామాజిక న్యాయం రాదు.. దానికి తగిన గౌరవం, మర్యాద కూడా ఇవ్వాలి. కానీ అవి ఏవీ లేవు. గత 14 సంవత్సరాల్లో పార్టీలో ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందులు, అవమానాలు భరాయించాను. ఈ విషయాన్ని ఎన్నోసార్లు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లాను. కానీ దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రజాప్రతినిధులంటే ప్రజల సొమ్ముకు ధర్మకర్తలా వుండాలి. కానీ దానికి భిన్నంగా నేటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజల సొమ్మును తన సొమ్ముగా భావిస్తున్నారు. ఇది భరించలేనటువంటి ఇబ్బంది అన్నారు. రాజకీయాల్లో ఇదే నా ఆఖరి మజిలీ కావచ్చు. ఎస్సీ ఎస్టీబీసీ, మైనారిటీలకు అండగా వుంటా. నా తుది శ్వాస వరకు బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేస్తా. గత ఐదేళ్లలో నన్ను నమ్ముకొని వున్న వారికి న్యాయం చేయలేకపోయా. అది నాకు ఎంతో బాధను గురి చేసింది. ఈ నెల 5, 6 తేదీల్లో లోకేష్ గురజాల నియోజకవర్గానికి రానున్న తరుణంలో పార్టీలో చేరతాను. క్రియాశీలకంగా పనిచేస్తానని జంగా వివరించారు. ఇప్పటికైనా నేను నా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడి వెళ్లడం లేదు. బీసీ, ఎస్సీ ఎస్టీలకు సరైన గుర్తింపు, సామాజిక న్యాయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వైసీపీని వీడటం కష్టంగా వున్నప్పటికీ పేద ప్రజల కోసం, నన్ను నమ్ముకున్న వారికి న్యాయం చేసేందుకు పార్టీని వీడుతున్నట్లు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి స్పష్టం చేశారు. ఇప్పటివరకు తనకు సహకరించిన పెద్దలు, బీసీ వర్గ శ్రేణులు, ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు జంగా తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, అంబటి నవకుమార్, మాజీ జడ్పీటీసీ కోగంటి శివన్నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, కాపు నాయకులు కొప్పుల గిరి, జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, తగుళ్ల పెదపిచ్చయ్య, మాశెట్టి పుల్లారావు, మాశెట్టి బుజ్జి, పగడాల భాస్కరరావు, బొమ్మిరెడ్డి సత్యం, కొక్కెర కొండలు, యారాసి వెంకటరావు, వేమవరం ఎంపీటీసీ శానంపూడి శ్రీనివాసరెడ్డి, జక్కా అనంతరామయ్య, కౌన్సిలర్లు షరీఫ్, మహంకాళి నీలంరాజు, ముండ్లపాటి సాంబశివరావు, సీతయ్య, గద్దల వేదమణి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు చెందిన నాయకులు, అభిమానులు పాల్గొని జంగాకు శాలువా కప్పి తమ మద్దతు తెలిపారు.



గామాలపాడులోని జంగా కృష్ణమూర్తి నివాసంలో సమావేశమైన టీడీపీ, జనసేన నేతలు

నేడు, రేపు వ్యవసాయ కళాశాలలో జాతీయ సదస్సు

బాపట్ల, ఏప్రిల్ 1: బాపట్ల వ్యవసాయ కళాశాలలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల జాతీయ స్థాయి శాస్త్రసాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ తెలిపారు. సదస్సుకు సంబంధించిన ఆహ్వానపత్రాలను సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు వ్యవసాయం, వ్యవసాయశాస్త్ర, సాంకేతిక విభాగాల ఆలంబనతో నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణ దిశగా రైతుల ఆర్థిక స్థితి గతులను మెరుగు పర్చటం అనే అంశంపై చర్చ జరుగుతుందన్నారు. పలు రాష్ట్రాలు నుంచి పీజీ, పి.హెచ్‌డి విద్యార్థులు 750 మందికి పైగా విచ్చేసి పరిశోధన పత్రాలు సమర్పిస్తారన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డాక్టర్ వి.శ్రీనివాసరావు, డాక్టర్ డీడీ స్మిత్, డాక్టర్ ఎల్.ఏడుకొండలు, ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ డి.వి. సాయిరాంకుమార్, సహాయ ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ లాల్ అహ్మద్, డాక్టర్ వి.వెంకటవిశ్వతేజ, విద్యార్థి ఆర్గనైజింగ్ సెక్రటరీలు అక్షయ్, నగేష్, సందీప్‌వర్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఎవి.రమణ తదితరులు

బాపట్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జేడీ శీలం



బాపట్ల, ఏప్రిల్ 1: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ బాపట్ల ఎంపీ అభ్యర్థిగా మరోసారి జేడీ శీలం పోటీ చేయనున్నారు. కాకుమాను మండలం పుసులూరు గ్రామానికి చెందిన శీలం గతంలో ఐఏఎస్ అధికారిగా అనేక ప్రాంతాల్లో పనిచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి 1999 లోకసభ ఎన్నికల్లో బాపట్ల నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ 2009 నుంచి 2014 వరకు రాజ్యసభ సభ్యుడిగా చేశారు. 2013 నుంచి 2014 వరకు కేంద్ర సహాయమంత్రిగా పనిచేశారు. రాష్ట్రవిభజన తర్వాత 2019 ఎన్నికల్లో కూడా బాపట్లలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి అతిస్వల్ప ఓట్లు మాత్రమే సాధించి ఓటమి పాలయ్యారు. తిరిగి పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధ కాగా అధిష్ఠానం ఆయన పేరును ప్రకటించింది.

వేమూరు వైసీపీ అభ్యర్థికి నోటీసు

అమృతలూరు, ఏప్రిల్ 1: వేమూరు వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబుకు నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు సోమవారం నోటీసులు జారీ చేశారు. అమృతలూరు మండలం కూచిపూడిలో ఇటీవల జరిగిన విలేకర్ల సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడుతూ ఎన్నారైలు తిరిగి తమ దేశాలకు వెళ్లే పరిస్థితి ఉండదంటూ బెదిరిస్తూ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు మీడియాలో ప్రచురితమవగా, సోషల్ మీడియాలో వైరల్‌గా మారియి. దీంతో స్పందించిన ఎన్నికల నియోజకవర్గ అధికారి అశోక్‌బాబును వివరణ కోరుతూ నోటీసు జారీ చేశారు.

వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా..

ముస్లింలను క్షమాపణ కోరిన పెమ్మసాని

మేడికొండూరు: ఏప్రిల్ 1: వీలైనంత వరకు ఎవరికైనా ఉపకారం చేసే వ్యక్తినే తప్ప ఇబ్బంది పెట్టే వ్యక్తిని కానని ముస్లింల మనోభావాలకు ఇబ్బంది కలిగినందున తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ క్షమాపణ కోరుతున్నట్లు టీడీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఫిరంగిపురం మండలంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి డాక్టర్ పెమ్మసాని సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వేములూరుపాడు, అమీనాబాద్, ఫిరంగిపురం, రేపూడి, గొల్లపాలెం తదితర గ్రామాల్లో రోడ్‌షో జరిగింది. పర్యటనలో భాగంగా అమీనాబాద్ గ్రామంలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ లాంలో పలువురు వైసీపీకి చెందిన ముస్లింలు టీడీపీలో చేరితే వారిని వైసీపీ నాయకులు చెదిరించగా వారిలో మనోధైర్యాన్ని నింపేందుకే తాను కొన్ని వ్యాఖ్యలు చేశానన్నారు. ఆ వ్యాఖ్యలు కొందరు ముస్లింలకు ఇబ్బంది కలిగిం చాయని తెలిసిన వెంటనే తాను ఆ వ్యాఖ్యలను ఉపసంహరించున్నానన్నారు. చాలా మందిలో బీజేపీ పొత్తుపై కొన్ని భిన్నాభిప్రా యాలు ఉన్నాయని, అయితే 2014 - 19 మధ్యలో టీడీపీ, బీజేపీ పొత్తులో ఉన్నా ఏ ఒక్క ముస్లింకు అన్యాయం జరగలేదని తెలి పారు. వేములూరుపాడు, అమీనాబాద్ గ్రామాల్లో కొండేపాక సాం బశివరావు, పీలా గోపి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 60 కుటుంబా లకు టీడీపీ కండువా కప్పి పెమ్మసాని పార్టీలోకి ఆహ్వానించారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని

పవర్ లేని మంత్రిగా సుచరిత

వేములూరిపాడులో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ వైసీపీ నుంచి పోటీ చేస్తున్న సుచరిత గతంలో హోం మంత్రిగా ఉంటూ కనీసం కానిస్టేబుల్‌ను కూడా మార్చలేని దుస్థితిలో పనిచేశారని ఆరోపించారు. దళిత మహిళ అయి ఉండి రాష్ట్రంలో ఎంతోమంది దళితులపై ధమనకాండ జరుగుతున్నా స్పందించలేని స్థితిలో ఉన్నారన్నారు. ఆమె బంధువుల మాత్రం ఎక్కడికి అక్కడ ఆర్థిక వనరులే లక్ష్యంగా దోచుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడైనా రోడ్ల నిర్మాణం జరిగాయి అంటే అది శ్రావణ్‌కుమార్ హయాంలోనే అన్నారు. సాగునీరు లేక రైతులు కన్నీళ్లు పెట్టుకోవడం చూడలేక, ఉద్యోగాలు లేక యువత బాధపడుతుంటే చూడలేక తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ ప్రభుత్వాన్ని రాజకీయ సమాధి చేయాలని పెమ్మసాని పిలుపునిచ్చారు.

గ్రూప్-1 మూల్యాంకనంలో అవినీతిపై ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 1: గ్రూపు - 1 మెయిన్ ఎగ్జామ్ పేపర్ మూల్యాంకనంలో అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొనుగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, విశ్రాంత డీజీపీ గౌతమ్‌సవాంగ్, పోలీసు అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిలపై రెండో పట్టణ ఎస్ఐ సతీష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2018 గ్రూపు - 1 మెయిన్స్ నోటిఫికేషన్‌కు సంబంధించి 2019లో జరిగిన ప్రిలిమ్స్‌లో అర్హులైన వారికి 2020లో జరిపిన ప్రధాన పరీక్షల డిజిటల్ మూల్యాంకనంలో ఓఎంఆర్ షీట్లు మార్చి వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మారుతీ, వెంకటరావు, షేక్ రఫీ, కూరపాటి హనుమంతరావు, షేక్ నాగూర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఎస్ఐ సతీష్‌కు ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నేతలు

పల్లెల్లో కూటమికి విశేష ప్రజాదరణ

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 1: చిలకలూరిపేటతో పాటు ప్రతి నియోజకవర్గంలో ప్రజలంతా కూటమి పార్టీల వైపు చూస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట మండలం గంగన్నపాలెం గ్రామానికి చెందిన 11 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. పట్టణంలోని మాజీ మంత్రి నివాసంలో వారందరికీ పార్టీ కండువాలు కప్పి ప్రత్తిపాటి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రచారానికి వెళ్ళిన ప్రతిచోట ప్రజాదరణ కన్పిస్తుందన్నారు. పార్టీ నేతలు సమన్వయం చేసుకుని వైసీపీ గూండాల బారిన పడకుండా ప్రజలను పోలింగ్ బూత్ వద్దకు తీసుకురావాలన్నారు. సూపర్ 6 పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యాయని, మరింత మందికి వాటిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్, రైతు నాయకులు అంబటి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి ప్రత్తిపాటి

మద్యం మత్తులో కొడుకు హతం



గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 1: మద్యం మత్తులో కన్న కొడుకుని కడతేర్చాడు ఓ తండ్రి.. పాత గుంటూరులోని క్రిస్టియన్‌పేటలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసుల కథనం ప్రకారం... పాత గుంటూరులోని క్రిస్టియన్‌పేటకు చెందిన తమనం కవిరాజు, అతని కుమారుడు మోజెస్ పాల్(29) ప్లంబర్లుగా పని చేస్తుంటారు. తండ్రీ, కొడుకు ఇద్దరు కలిసి మద్యం సేవిస్తూ ఉంటారు. మోజేష్ పాల్ కొద్దిరోజులుగా పెళ్లి చేయమని తండ్రితో తరచు గొడవ పడుతున్నాడు. ఆదివారం వారిద్దరి మధ్య బైక్ విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో తండ్రిపై కొడుకు మోజెస్ పాల్ చేయి చేసుకున్నాడు. దీంతో కోపద్రిక్తుడైన కవిరాజు పక్కనే ఉన్న మంచం కోడు తీసుకొని కొడుకుపై కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు మోజెస్ పాల్ అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. పాత గుంటూరు పోలీసులు సంఘన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడు తల్లి శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సమీక్షలో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు, ఎస్పీ వకుల్ జిందాల్

సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలి

● గుంటూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు

బాపట్ల, ఏప్రిల్ 1: పోలీసు అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ సమర్థంగా విధులు నిర్వహించాలని గుంటూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు తెలిపారు. బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లా పోలీసు అధికారులు తీసుకుంటున్న చర్యలు గురించి ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన సమీక్షించారు. సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచి చెడు నడత కలిగిన వ్యక్తులను బైండోవర్ చేయాలని తెలిపారు. ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా వారిలో భరోసా కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అరెస్టు వారెంట్లను వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమంగా రవాణా జరిగే నగదు, మద్యాన్ని, ప్రజలను ప్రలోభాలకు గురిచేయటానికి ఉపయోగించే బహుమతులు, వస్తువులను కట్టడి చేయాలన్నారు. రోజు ఫ్లాగ్‌మార్చ్‌లు, ఫుట్‌పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు గురిం చి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీడీ విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ బి.ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఏఆర్‌డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.మల్లికార్జున, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.మురళీకృష్ణ, ఎలక్షన్ సెల్ సీఐలు కె.శ్రీనివాసురెడ్డి, సి.హెచ్. గంగయ్య, ఐటీ కోర్ ఎస్ఐ నాయుబ్ రసూల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోను ప్రజల చెంతకు చేర్చండి

● ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



ప్రసంగిస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు

అమరావతి, ఏప్రిల్ 1: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ, రైతులు, మహిళలకు అందించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల మ్యానిఫెస్టోను వారి ముంగిటకు తీసుకు వెళ్లాలని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. సోమవారం మండలంలోని పెదమద్దూరు, చావపాడు, ఎండ్రాయి, నరుకుళ్లపాడు, లేమల్లె, నెమలికల్లు, ముత్తాయపాలెం గ్రామా ల్లో పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌తో కలసి ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రతి నాయకుడు వ్యక్తిగత ద్వేషాలకు స్వస్తిపలికి అందరితో కలసి టీడీపీ కూటమికి మద్దతు పలికేలా కృషి చేయాలన్నారు. నరసరావుపేట ఎంపీగా తనను, పెదకూరపాడు శాసన సభ్యునిగా భాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా నాయకులు పనిచే యాలన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ తాగునీరు, సాగునీరు, రహదారుల సమస్యలు ఉన్నట్లు గమనించడం జరిగిందని అధికారంలోకి రాగానే సత్వర పరిష్కార చర్యలు చేపడతామన్నారు. పర్యాటక కేంద్రంగా అమరావతిని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కన్నా రజని మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం 75 సంవత్సరాల వయస్సులో ఎండను లెక్కచేయకుండా సమావేశాలు నిర్వహిస్తున్న చంద్రబాబునాయుడు ను ఆదర్శంగా తీసుకుని వైసీపీ పాలనను అంతమొందించి ఉమ్మడి కూటమి ప్రభుత్వం వచ్చేలా మూడు పార్టీల నాయకులు కలసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, వెన్నా సాంబశివారెడ్డి, ఎం.గంగాధర్, ఎం.విష్ణు, కె.వసంతరావు, వి.ధర్మారావు పాల్గొన్నారు.

ఎండ్రాయి ఎంపీటీసీ టీడీపీలో చేరిక



ఎంపీ కృష్ణదేవరాయలు, భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన శివయ్య

అమరావతి, ఏప్రిల్1: మండలంలోని ఎండ్రాయి గ్రామ ఎంపీటీసీ సభ్యులు దేవబత్తిన శివయ్య సోమవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎండ్రాయి గ్రామంలో జరిగిన కార్య క్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎంఎల్ఏ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరడం జరిగింది. కృష్ణదేవరాయలు శివయ్యకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక పాలన వలన విసుగు చెంది వైసీపీ నుంచి టీడీపీలో చేరినట్లు శివయ్య తెలిపారు.

పింఛన్ల సొమ్ము పక్కదారి పట్టించిన జగన్

● టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇంటి వద్దకే రూ.4 వేలు పింఛన్

● యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, ఏప్రిల్1: పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు వేల కోట్ల రూపాయలను ఎన్నికల కోడ్ అమలులో వున్నా సొంత కాంట్రాక్టర్లకు జగన్ దోచి పెట్టారని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీన ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని జగన్ ఎందుకు ఆదేశాలు జారీచేయలేదని, రాష్ట్రంలో 1.35 లక్షల మంది సచివాలయ ఉద్యోగుల ద్వారా యుద్ధప్రాతిపదికన పింఛన్లను ఇంటివద్దనే పంపిణీ చేసే అవకాశం వున్నా జగన్ స్వార్థరాజకీయాల వల్లనే పింఛన్‌దారులు నేడు పింఛన్ సొమ్ము తీసుకోలేకపోయారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటివద్దకే నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తామని, సకాలంలో ఇంటివద్ద లేకపోయినా పొరుగు ఊర్లలో వున్న వారికి తరువాత నెలైనా కలిపి పింఛన్ అందజేయడం జరుగుతుందన్నారు. ఎప్పటిలాగే నేడు కూడా సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్లవద్దనే పింఛన్ పంపిణీ చేయకపోతే సీఎస్ జవహర్‌రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డిపై ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకోవాలన్నారు. జగన్ తన దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎన్నికల కమిషన్, నిమ్మగడ్డ రమేష్‌కుమార్, తెలుగుదేశంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వలంటీర్లను ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా చేసి వందల మందిని సస్పెన్షన్ చేయించడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదుకు జగన్మోహన్‌రెడ్డి కారకులయ్యారన్నారు.

పాలవ్యాన్ ఢీకొని యువకుడి మృతి

చిలకలూరిపేట, ఏప్రిల్1: జాతీయ రహదారిపై పట్టణంలోని విజయ బ్యాంక్ సెంటర్‌లో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక కుమ్మరికాలనీకి చెందిన రావూరి రామకృష్ణ(27), అతని స్నేహితుడు డేనియల్(22) తెల్లవారుజామున 2 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా ఒంగోలు నుంచి గుంటూరు వెళ్తున్న పాలవ్యాన్ ఢీకొంది. ఈ వ్యాన్ జాతీయ రహదారిపై ఉన్న గ్రిల్స్‌ను ధ్వంసం చేసుకుంటూ పక్కకు వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా డేనియల్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన యువకుడిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



గుడ్‌మార్నింగ్ చాయ్ కార్యక్రమంలో వ్యాపారులతో మాట్లాడుతున్న నిఖిల్

ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ..

● 'గుడ్‌మార్నింగ్ చాయ్' కార్యక్రమంలో యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 1: గురజాల నియోజకవర్గంలో ఆర్యవైశ్యులకు టీడీపీ ఎప్పుడూ అండగా వుంటూనే వుంటుందని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తనయుడు సాయినిఖిల్ తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల, జానపాడు రోడ్డులోని ఓ టీస్టాల్ వద్ద గుడ్ మార్నింగ్ చాయ్‌తో పలువురు సీనియర్ సిటిజన్స్, ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులతో ముచ్చటించారు. టీడీపీ అధికారంలో వున్నప్పుడు అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను కొనసాగాయని, వైసీపీ పాలనలో అధికారం, పెత్తనం, అరాచకమంతా సాగిస్తుండటంతో ఏ ఒక్కరు తమ వ్యాపారాలు నిశ్చింతగా చేసుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ బాధలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.



రేగులమాన్యం ఎన్నికల ప్రచారంలో బ్రహ్మారెడ్డి సతీమణి శోభ

బ్రహ్మారెడ్డిని మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి

● బ్రహ్మారెడ్డి సతీమణి జూలకంటి శోభ

రెంటచింతల, ఏప్రిల్ 1: మే నెలలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా మాచర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జూలకంటి బ్రహ్మారెడ్డిని మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించాలని, తాము ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటామని బ్రహ్మారెడ్డి సతీమణి జూలకంటి శోభ వినమ్రంగా ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం రెంటచింతలలోని రేగులమాన్యంలో ఇంటింటికి తిరిగి ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి బ్రహ్మారెడ్డి గెలుపు ఆవశ్యకతను వివరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ 6 పథకాలతో ఏ విధంగా లబ్ధి చేకూరుతుందో వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి సీఎంగా చంద్రబాబును నాలుగోసారి గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎల్లవేళలా మీకు తోడుగా ఉంటామని హామీనిచ్చారు. రెండు ఓట్లూ టీడీపీకే వేసి అటు ఎంపీ అభ్యర్థి లావును, ఇటు బ్రహ్మారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అబ్బిరెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, వై.రమేష్‌బాబు, యెనిగండ్ల శ్రీను, కాయితి రవి, బోడపాటి రామకృష్ణ, పల్లెర్ల లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, నాగరాజు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో బ్రహ్మారెడ్డికి అవకాశమిద్దాం

మాచర్లటౌన్, ఏప్రిల్ 1: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డికి ఒక్క అవకాశమిచ్చి మాచర్ల నియోజకవర్గ అభివృద్ధిని సాధించుకుందామని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు సూపర్ 6 పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, యెనుముల కేశవరెడ్డి, మాచర్ల వాసు, మురళి, శ్రీనివాసరావు, నాయక్, చంటి, అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజీ (నామా) డ్రామా !

● ఉప ఎంపీపీ-2 పదవికి రాజీనామా.. అంతలోనే వెనక్కి

మాచవరం, ఏప్రిల్ 1: మాచవరం మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామానికి చెందిన ఉప ఎంపీపీ-2 చల్లగుండ్ల లక్ష్మయ్య తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. అంతలోనే తన రాజీనామా పత్రాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కొత్తగణేశునిపాడు గ్రామం నుంచి చల్లగుండ్ల లక్ష్మయ్య వైసీపీ తరుపున ఎంపీటీసీగా గెలుపొందారు. ప్రభుత్వం ఉప ఎంపీపీలు ఇద్దరు వుండాలనే నిబంధనతో రెండవ ఉప ఎంపీపీగా లక్ష్మయ్యను ఎన్నుకున్నారు. లక్ష్మయ్య గత కొంతకాలంగా రెవెన్యూ కార్యాలయంలో తనకు సంబంధించిన పొలాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని అసంతృప్తితో వున్నాడు. మండల వైసీపీ నేతలకు చెప్పినప్పటికీ తన పని కాకపోవడంతో ఉప పదవికి రాజీనామా చేసి ఎంపీడీవో బీ. సురేష్‌కు అందజేశారు. ఇంతలో ఏమి జరిగిందో గానీ.. గంటలోపే లక్ష్మయ్య తన రాజీనామా పత్రాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక నుంచి పార్టీ ఏది చెబితే అదే చేస్తానంటూ ఒక వీడియో కూడా లక్ష్మయ్య రిలీజ్ చేశాడు. వైసీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకే రాజీనామాను వెనక్కి తీసుకున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

రాత్రి సమయాల్లో మట్టి తవ్వకాలు

● పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మాచవరం, ఏప్రిల్ 1: మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి సమయాలలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. గోవిందాపురం, పులిచింతల ముంపు భూముల్లో చెన్నాయపాలెం, వేమవరం గ్రామాల సమీపంలోని సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఆ మట్టిని ట్రక్కులు, టిప్పర్ల లెక్కన రైతుల మెట్ట భూములకు తోలుతూ అక్కమార్కులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇది తెలిసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు విషయంపై స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

అచ్చంపేట, ఏప్రిల్ 1 : మండలంలోని పెదపాలెం, కొండూరు గ్రామాల్లో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. 30 మంది బీఎస్ఎఫ్ జవాన్లు, 10 మంది స్థానిక పోలీసులు పాల్గొన్నారు. బీఎస్ఎఫ్ ఇన్‌చార్జి ఎంఎన్ బీరు, అచ్చంపేట సీఐ ఎస్‌కే కరిముల్లా ఆధ్వర్యంలో ఈ కవాతు జరిగింది.

దుర్గి: ఎన్నికల నేపథ్యంలో అత్యుత్సాహంతో ఎవరైనా హింసకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కారంపూడి సర్కిల్ సీఐ చినమల్లయ్య హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని ఆత్మకూరు, జంగమహేశ్వరపాడు, శ్యామరాజపురం, ధర్మవరం గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సిబ్బందితోపాటు ఎస్ఐ కోటయ్య పాల్గొన్నారు.

పిడుగురాళ్ల : మండలంలోని జానపాడు, పందిటివారిపాలెం గ్రామాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ పీవీ.ఆంజనేయులు ప్రజలకు సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అమీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్ల నాగేశ్వరరావు

బీసీల అభ్యున్నతికి కృషి చేసింది టీడీపీనే..

కారంపూడి, ఏప్రిల్ 1: బీసీల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసింది టీడీపీ ఒక్కటేనని బీసీ సెల్ మండల కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం బస్టాండ్ సెంటర్లోని ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో టీడీపీ బీసీ నేతల సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం బీసీలంతా ఐక్యంగా ఉండి ఉమ్మడి కూటమిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ బీసీలకు ఇచ్చిన రాజకీయ ప్రాముఖ్యం ఏ పార్టీ కూడా ఇవ్వలేదన్నారు. పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగింది టీడీపీలోనే అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి నియోజవర్గ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, నాగవరపు రాముడు, శివ, దుర్గ, తెలుగు యువత మండల అధ్యక్షుతు తుపాకుల చినరత్తయ్య, తోట నరసింహారావు, తండా మస్తాన్‌జాని, చప్పిడి రాము తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం తథ్యం

● నియోజకవర్గంలో స్వేచ్ఛాయుత పరిస్థితిని కల్పిస్తా
● అవ్వతాతల పింఛన్ సొమ్మును పక్కదారి పట్టించారు
● మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డి

రెంటచింతల,ఏప్రిల్ 1 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమని మాచర్ల అసెంబ్లీ నియోకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ కాలని, ఎర్రపాలెం తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పవనాలు బలంగా వీస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ భయంగా బతుకుతున్నారని రానున్న రోజుల్లో స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడమే తన ధ్యేయమని ఆ దిశగా పనిచేస్తున్నాని అన్నారు. ముందుగా మహిళలు మంగళ హారతులతో బ్రహ్మారెడ్డికి స్వాగతంపలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, గొంటు సుమంత్ రెడ్డి, రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, రాజ్‌కుమార్, మామిడి రవి, దానయ్య, సామ్యేల్, జ్ఞానయ్య, శౌరీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై కోడికత్తి డ్రామాలు ఆపాలి ..

మాచర్లటౌన్: అవ్వాతాతలకు అందించే సామాజిక పింఛన్లపై వైసీపీ నేతలు కోడి కత్తి డ్రామాలు, గొడ్డలి పోటు నటనలను ఆపాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలతో కలిసి ఉండవల్లిలో సీఎస్ జవహర్‌రెడ్డిని ఆయన కలిశారు. సోమవారం సెలవుదినం కావడంతో మంగళవారం విత్‌డ్రా చేసి బుధవారం పింఛన్లు పంపిణీ చేస్తామని సీఎస్ తెలిపారన్నారు. అసలు ట్రెజరీలో సరిపడా డబ్బు ఉందా లేదా అని ప్రశ్నించగా నగదు అందుబాటులో ఉందని సీఎస్ సమాధానమిచ్చినట్లు చెప్పారు. గతంలో వైసీపీ విషపు పత్రిక సాక్షిలో ఏప్రిల్ మూడో తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని సంబంధిత మంత్రి చేసిన ప్రకటన సైకో జగన్ మరిచిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. శనివారం విత్‌డ్రా చేయాల్సిన నగదు ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. పింఛన్ నగదు పక్కదారి పట్టించి ఉంటారన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఒకటో తేదీన సెలవు వచ్చినప్పటికీ ముందు రోజే నగదు విత్‌డ్రా చేసి లబ్ధిదారులకు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు కోడి కత్తి డ్రామాలు, గొడ్డలిపోటు ఘటనలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని మీ నాటకాలకు తెరదించే సమయం ఆసన్నమైందని బ్రహ్మారెడ్డి హెచ్చరించారు.



పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

వైసీపీని వీడి పలువురు టీడీపీలో చేరిక..

విజయపురిసౌత్: మాచర్లమండలం అనుపు చెంచుకాలనీకి చెందిన 30 వైసీపీ కుటుంబాలు సోమవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం రాత్రి మండల కేంద్రమైన రెంటచింతలలో జరిగిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రచారంలో వీరు పాల్గొని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

సైకోను సాగనంపాలి

● సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 1 : సైకో సీఎం వైఎస్ జగన్‌ను సాగనంపేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని ఏఎంఏ హాల్లో బీజేపీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో కన్నా మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. ఎన్‌డీఏ కూటమి చేసిన అభివృద్ధిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలన్నారు. సమావేశంలో నేతలు రవి శంకర్, అలోకం సుధాకర్, శ్రీనివాసరావు, కట్టా శంకరరావు, పెద్దన్నరావు నాయక్, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 13వేల కోట్లు బినామీ కాంట్రాక్టర్లకు జగన్ దోచి పెట్టాడు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత 15 రోజుల్లో తన బినామీ కాంట్రాక్టర్లకు రూ.13వేల కోట్లు దోచిపెట్టిన వైఎస్ జగన్ అవ్వాతాతలకు పింఛన్ ఇవ్వటానికి మాత్రం రాజకీయ కుట్ర చేస్తున్నారని కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. తన స్వార్థ రాజకీయల కోసం వృద్ధులు, వికలాంగులకు పింఛన్లను ఆపి నరకం చూపిస్తున్నాడని మండిపడ్డారు. పింఛన్ల పంపిణీపై వైసీపీ చేస్తున్న విష ప్రచారాన్ని ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలన్నారు. ఇంటింటికి పింఛన్లు పంపిణీని ప్రభుత్వమే కావాలని జాప్యం చేస్తుందని కన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు.



కట్టమూరులో ప్రచారం నిర్వహిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

కట్టమూరులో కన్నా ప్రచారం ..

మండలంలోని కట్టమూరులో సోమవారం రాత్రి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్ళి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలన్నారు. ముందుగా పార్టీ నేతలు, కార్యకర్తలు బాణసంచాతో, తప్పెట్లతో కన్నాకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, నాయకులు మందడి ఖాళీ ప్రసాదు, మందడపు శ్రీనివాసరావు, మందడి బాబు, దావీదు, మందడి చక్రధర్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు

● రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్లటౌన్, ఏప్రిల్ 1: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో సోమవారం నియోజకవర్గ పరిధిలోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ నామినేషన్ ప్రక్రియను వివరించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్, వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి వారికి ఓటు హక్కు కల్పించడంపై వివరించారు. అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఘర్షణలు జరగకుండా చూసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌పై బీజేపీ పన్ను ఉగ్రవాదం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 1: రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై ఆదాయపు పన్ను శాఖను ఉసిగొల్పి కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసి నిర్వీర్యం చేయాలని చూస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష ముఖ్యమంత్రులపై సీబీఐ, ఈడీ శాఖల దాడులు చేయిస్తూ బలహీన పరచాలని చూస్తోందన్నారు. ఒకే పార్టీ ఒకే దేశం అనే నినాదాన్ని అమలు చేయాలని ప్రతిపక్షాలపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు షేక్. బాబు, వీ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని పర్యటన

మాచవరం, ఏప్రిల్ 2: మాచవరంలో మంగళవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు, గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావులు పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బీ.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మునుసుబు కల్యాణ మండపంలో జరిగే కార్యకర్తల సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

పేదల చెంతకు సంక్షేమ పథకాలు

కారంపూడి, ఏప్రిల్ 1: సంక్షేమ పథకాలను పేదల చెంతకు చేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక అంకాళమ్మ ఆలయంలో పూజాధికాలు నిర్వహించిన అనంతరం మండలంలోని కాచవరంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. నవరత్నాలును 90 శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో కాచవరం నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించానని, ఆనవాయితీ మరలా ఇక్కడి నుంచి ప్రచారం ప్రారంభించానని చెప్పారు. తనను గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య, జడ్పీటీసీ షేక్ షఫి, అంకిరెడ్డి, మందాల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలోనే పింఛన్ల పంపిణీ

● ఎన్నికల ప్రవర్తనా నియామవళి అధికారి శంకర్‌రావు

రెంటచింతల,ఏప్రిల్ 1 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పింఛదారులకు ఏప్రిల్ 3 నుంచి సచివాలయాల్లోనే పింఛన్‌ను అందచేయాలని ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు అధికారి పెదప్రోలు శంకర్‌రావు ఆదేశించారు. సోమవారం సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 269 మంది వలంటీర్ల నుంచి సెల్‌ఫోన్ సిమ్‌లు, బయోమెట్రిక్ డివైజ్‌లను వెనక్కు తీసుకున్నామన్నారు. ఎన్నికలకాలం మూడు నెలలు వరకు సచివాలయ అధికారులతో పింఛన్లు అందచేస్తమన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.

ఉపాధి వేతనం రూ. 28 పెంపు

రెంటచింతల,ఏప్రిల్ 1 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే వేతనదారులకు రూ.28లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీవో జయచంద్ర సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.272 ఉన్న వేతనాన్ని రూ.300లకు పెంచిందన్నారు. ఈ నిర్ణయంతో రెంటచింతల మండలంలో వున్న 800 గ్రూప్‌లో వున్న 17,951 మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. పెంచిన వేతనాలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని ఏపీవో తెలిపారు.

విత్తన మొలక శాతం అధికంగా ఉండాలి

రెంటచింతల,ఏప్రిల్ 1 : మిర్చిలో విత్తన మొలక శాతం అధికంగా ఉండాలని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం ఏడీఏ ఓబులేశు అన్నారు. సోమవారం మిర్చి విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు అందజేశారు. అనంతరం పట్టణంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓబులేశు మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బుక్స్ ఖచితంగా నిర్వహించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మాచర్ల ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏవోలు బోయపాటి బ్రహ్మారెడ్డి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

వెల్దుర్తి, ఏప్రిల్ 1: అడవిపందిని తప్పించబోయి ఆటో బోల్తా పడడంతో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని మండాది బోడు వద్ద సోమవారం జరిగింది. మాచర్ల పట్టణంలోని శెరిన్‌కాలనీకి చెందిన 15 మంది వ్యవసాయ కూలీలు మండలంలోని మండాదిలో మిర్చి కోతలకు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలోని మండాది బోడు వద్ద ఎదురుగా అడవిపంది రావడంతో ఆటోడ్రైవర్ దాన్ని తప్పించబోగా అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో నారోజు నారాయణమ్మ(55) అక్కడికక్కడే మృతిచెందింది. వ్యవసాయ కూలీలు నాగేంద్రమ్మ, మునిలతో పాటు డ్రైవర్ దానుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వీరిని నరసరావుపేటకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్ధరాత్రి ఆక్రమణకు యత్నం

● మునిసిపల్ రిజర్వాయర్ ప్రహరీ ధ్వంసం
● చోద్యం చూస్తున్న పురపాలక సంఘ అధికారులు

మాచర్లటౌన్, ఏప్రిల్ 1: ఆక్రమణకు కాదేది అడ్డు.. అన్నట్టు కొందరు అక్రమార్కులు పట్టణంలోని మునిసిపల్ రిజర్వాయర్ ప్రహరీ ధ్వంసానికి పాల్పతూ ఆక్రమణకు దిగుతున్నారు. గతంలో కేసీపీ సిమెంట్ పరిశ్రమ వినియోగించిన క్వారీని పురపాలక సంఘ ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు వితరణగా మునిసిపాలిటీకి అందించింది. ఈ క్వారీని సాగర్ కుడి కాలువ జలాలతో నింపి పట్టణ ప్రజలకు తాగునీటిని అందిస్తూ వచ్చారు. అయితే ఈ నీరు కలుషితం కాకుండా ఉండేందుకు 15 క్రితం క్వారీ చుట్టూ లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రహరీ నిర్మించారు. అయితే ఇప్పుడు దీనిపై అక్రమార్కుల కన్ను పడింది. మాచర్ల - సాగర్ ప్రధాన రహదారిలోని బీఎస్ఎన్ఎల్ టవర్ పక్కన గల ఈ ప్రహరీని కూల్చివేసి విలువైన స్థలాన్ని ఆక్రమించుకొని రూ.కోట్లు గడించాలని కొందరు అక్రమార్కులు పథకం పన్నారు. మూడు రోజులుగా అర్ధరాత్రి సమయంలో కొంచెం కొంచెంగా ప్రహరీను ధ్వంసం చేస్తూ వస్తున్నారు. అయితే దీనిపై పురపాలక సంఘ అధికారులు చోద్యం చూస్తూ ఎటువంటి చర్యలు తీసుకోక పోతుండడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఆక్రమణదారులు ధ్వంసం చేసిన రిజర్వాయర్ ప్రహరీ





టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రవీణ్, ఇఫ్తార్ విందు వడ్డిస్తూ..

కూటమి విజయం ఖాయం

● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఏప్రిల్ 1 : పెదకూరపాడు నియోజకవర్గంలో కూటమి విజయం ఖాయమని కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ స్పష్టంచేశారు. సోమవారం ఆయన దొడ్లేరు గ్రామంలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. దొడ్లేరులో టీడీపీకి అత్యధిక మెజార్టీ సాధించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. టీడీపీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను విస్తృతంగా ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే బీసీ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలన్నారు. దొడ్లేరు గ్రామం అనేక సమస్యలు ఉన్నాయని, టీడీపీ అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, శ్రీనివాసరావు, వెంకటరావు, నాగేశ్వరరావు, హనుమంతరావు, మొగల్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో భాష్యం ప్రవీణ్ ..

మండలంలోని దొడ్లేరులో ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా, భాష్యం ప్రవీణ్ పాల్గొని ముస్లింలను ఆప్యాయంగా పలుకరిస్తూ, స్వయంగా ఆయనే విందు వడ్డించారు. వందలాది మంది ముస్లింలు ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా నేతలు మొగల్ జాన్, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం ప్రవీణ్

లేమల్లెలో వైసీపీకి షాక్ .. 50 కుటుంబాలు టీడీపీలోకి ..

అమరావతి : మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు సోమవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో స్థానిక టీడీపీ నేత టీ.శుభాకర్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ జానీతో పాటు మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొండూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు ..

అచ్చంపేట: మండలంలోని కొండూరు గ్రామంలో వైసీపీకి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్, ఆయన సతీమణి లావణ్య వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కుంభా నాగేశ్వరరావు, కుంభా శ్రీను, కుంభా గోపీ, లక్ష్మి, కే.నాగరాజు, ముదిరాజులు సీహెచ్ రామయ్య, సీహెచ్ తిరుపతయ్య, సీహెచ్ చిన రామయ్య తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రవీణ్ సతీమణి లావణ్య కోరారు.

పెదకూరపాడులో గెలిచేది కూటమి అభ్యర్థే..

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఏప్రిల్ 1 : స్థానిక శాసన సభ్యులు నంబూరు శంకరరావు ఎన్ని కుయుక్తులకు పాల్పడ్డా, ఎన్ని విష ప్రచారాలు చేసినా పెదకూరపాడు నియోజకవర్గంలో గెలిచేది కూటమి అభ్యర్థేనని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని ఆయన నివాసంలో నియోకవర్గ టీడీపీ నేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ.. రాష్ట్రమంతా టీడీపీకి బ్రహ్మారథం పడుతున్నారని, నియోజకవర్గ ప్రజలు కూడా టీడీపీకి అండగా ఉంటారన్నారు. టీడీపీ గెలుపు ఖాయమని తెలుసుకున్న వైసీపీ నేతలు వికృత విషప్రచారాలకు పూనుకున్నారని ఎద్దేవాచేశారు. అమరావతి రాజధానిని శ్మశాన ఛాయలుగా మార్చిన సీఎం జగన్ ఎంత విధ్వంసకారుడో అతని మద్దతు పలికిన ఈ ప్రాంత వైసీపీ నేతలు అంతే విధ్వంసకారులవుతారన్నారు. అసెంబ్లీలో అమరావతి రాజధాని వద్దని ఓటు వేసిన వైసీపీ నేతలు ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ఆయన అన్నారు.

సూపర్-6 పథకాలపై అవగాహన కల్పించాలి

బెల్లంకొండ, ఏప్రిల్ 1 : సూపర్ - 6 పథకాల పై బెల్లంకొండ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలదరికీ అవగాహన కల్పించాలని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నారు. సోమవారం మండల కేంద్ర మైన బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో స్థానిక టీడీపీ నేతలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం కూటమి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ - 6 పథకాలతో పాటు బీసీలకు డిక్లరేషన్ ఏర్పాటు చేయటం గర్వించదగ్గ విషయన్నారు. బెల్లంకొండ మండలంలోని టీడీపీ నాయకులు అందరూ కలసి కట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నేతలు లక్ష్మీనారాయణ, జ్యోతి సముద్రం, అక్కుల వెంకటరామిరెడ్డి, గుంజా గంగారావు, గుడిసె కొండయ్య, వెన్నా సీతారామిరెడ్డి, ఇబ్రహీం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనతోనే యువతకు భవిష్యత్తు..

రాజుపాలెం,ఏప్రిల్1: మన రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చి యువతకు మరలా ఉపాధి అవకాశాలు రావాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి చంద్రనాయుడు సీఎం కావాలని నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవయాదవ్ అన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని రాజుపాలెం, బ్రహ్మణపల్లి, నెమలిపురి గ్రామాలలో కరపత్రాలతో ప్రచారం చేశారు. రాఘవయాదవ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో సీఎం జగన్‌రెడ్డి యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేకుండా చేసి వారిని గంజాయి, డ్రగ్స్, మద్యానికి వ్యసనపరులుగా మార్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, గంగవరపు రామలక్ష్మణరావు, లంకావీరయ్య, పగడాల శ్రీను, తమటం వీరయ్య, గంజి శ్రీను, వెంకయ్య, మునలయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామ స్వామి

బీసీలకు అండ తెలుగుదేశం జెండా..

సత్తెనపల్లి, ఏప్రిల్ 1 : బీసీలకు అండ తెలుగుదేశం జెండా అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎలినేడి రామ స్వామి అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో సోమవారం జయహో బీసీ మండల సమావేశం నిర్వహించారు. రామస్వామి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే మరలా బీసీలకు మేలు జరుగుతుందన్నారు. బీసీల సంక్షేమం కోసం టీడీపీ ప్రత్యేక మేనిఫెస్టోను ప్రకటించిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి, టీడీపీ అభ్యర్థుల విజయానికి ఐక్యంగా పని చేస్తామన్నారు. కన్నా లక్ష్మీనారాయణ, లావు శ్రీ కృష్ణ దేవరాయలు విజయానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల వెంకటస్వామి, పూజల వెంకట కోటయ్య, తొరటి వెంకటరావు, తుమ్మల ఏడుకొండలు, మారెళ్ళ స్వామి, జింకా లోకేశ్వరరావు, గద్దె అప్పారావు, పత్తిపాటి హరేకృష్ణ, తోట శ్రీను, బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

- మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 1: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇతర ప్రాంతాల నుండి వివిధ రకాల పనులపై నరసరావుపేట పట్టణానికి వచ్చే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని నరసరావుపేట మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు.సమావేశంలో నరసరావుపేట పట్టణంలో శానిటేషన్ మెరుగుపరచడానికి అన్ని విభాగ అధికారులు సమన్వయంగా పనిచేసేలా తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సమావేశానికి మున్సిపల్ ఇంజనీర్ కనకారావు, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నాయక్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాబోయే కాలంలో సమాజానికి టెక్నాలజీ ఎంతో అవసరం

● జేఎన్‌టీయూ ఎసెంట్రిక్స్ టెక్‌ఫెస్ట్‌లో ముఖ్యఅతిథి సిద్దయ్య



ఎసెంట్రిక్స్ పత్రికను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథి పీ సిద్దయ్య తదితరులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1: రాబోవు కాలంలో సమాజానికి టెక్నాలజీ ఎంతో అవసరం అని ముఖ్యఅతిథి డాక్టర్ వైఎస్ఆర్ ఏఎస్‌యూ కాలేజీ ప్రిన్సిపాల్ పీ సిద్దయ్య అన్నారు. సోమవారం జేఎన్‌టీయుఎన్ కళాశాలలో ఎసెంట్రిక్స్ టెక్‌ఫెస్ట్ జరిగింది. ఎసెంట్రిక్స్ పత్రికను ముఖ్యఅతిథి పీ సిద్దయ్య, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, కన్వీనర్ డాక్టర్ ఏ గంగాధర్, ఫెస్ట్ సమన్వయకర్తలు ఎస్‌వీ సాయిప్రసాద్, వై నవీన్ కుమార్, స్టూడెంట్ సమన్వయకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ టెక్నికల్ ఫెస్ట్‌లు ఆధునిక టెక్నాలజీ గురించి వివరిస్తాయని, అలానే విద్యార్థులలో టాలెంట్‌ని కూడా పొందుపరుస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ టెక్ ఫెస్ట్‌లో వీఎల్ఎస్ఐ వర్క్‌షాప్‌కు విశేష స్పందన లభించిందని, మిగిలిన ఈవెంట్స్‌లో విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. టెక్‌ఫెస్ట్ సమన్వయకర్త ఎస్‌వీ సాయిప్రసాద్ మాట్లాడుతూ వివిధ ఈవెంట్స్‌కి 310మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఫెస్ట్ విజయవంతం అయిందన్నారు.


కోటప్పకొండకు పాదయాత్ర



టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవాలంటూ కోటప్పకొండకు పాదయాత్ర

రొంపిచర్ల, ఏప్రిల్ 1: నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు రాబోయే ఎన్నికల్లో గెలవాలంటూ మండలంలోని ఆరేపల్లి గ్రామం నుంచి కోటప్పకొండకు పాదయాత్రను సోమవారం చేపట్టారు. మండల బీసీ సాధకారిత అధ్యక్షుడు కనిగిరి బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల అధ్యక్షుడు పులుకూరి జగ్గయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రొంపిచర్లలో పాదయాత్రకు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, మంజుల ఆంజనేయులు, వడ్లమూడి కిషోర్, నెల్లూరి పాపారావు, పల్లెల వెంకట రత్నారెడ్డి, చిన్న అంజిరెడ్డి, దేనువకొండ సాంబశివరాజు, నెల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రను ముగించుకొని నరసరావుపేటకు వచ్చిన వారిని అరవిందబాబు అభినందించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలి



తురుమెళ్ళలో మాట్లాడుతున్న డీఎస్పీ వర్మ

రొంపిచర్ల, ఏప్రిల్ 1: రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ వర్మ సోమవారం తెలిపారు. మండలంలోని తురుమెళ్ళ, అలవాల గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని అందరూ పాటించాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్నవరప్పాడు గ్రామం వద్ద సరిహద్దు జిల్లా చెక్‌పోస్టును ఆయన సందర్శించి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన వెంట సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రవీంద్ర ఉన్నారు.

అక్రమ మద్యం కేసులో మహిళ అరెస్టు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 1 : అక్రమంగా 15 సీసాల మద్యం కలిగి ఉన్న కేసులో నిందితురాలైన మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన గుంజి సుజాతను సోమవారం అరెస్టు చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా పెట్లూరివారిపాలెం గ్రామంలో నిందితురాలు అక్రమ మద్యం కలిగి ఉండగా అరెస్టు చేశామన్నారు. ఆమె నుంచి రూ.2400 విలువైన 5.05 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఓటమి భయంతో డిప్రెషన్‌లో బొల్లా

● బూతులు ఆపాలని హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండటౌన్, ఏప్రిల్ 1: బొల్లా ఓటమి భయంతో, చేసిన అభివృద్ధి లేక ప్రజలకు సమాధానం చెప్పలేక, డిప్రెషన్‌కు గురై నోటికి వచ్చినట్లు బూతులు తిడుతున్నారని, ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్నపుడు అనీల్‌కుమార్ యాదవ్ తంగిరాల ప్రాజెక్టుకు ఎందుకు నిధులు ఇవ్వలేక పోయారని, ఇక్కడ పోటీ చేసే అర్హత నీకు లేదని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, బ్రహ్మనాయుడు వీడియోలను చూసి, ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. వివాదాల భూముల్లో అభివృద్ధి పేరుతో ప్రజల కళ్ళకు గంతలు కట్టే ప్రయత్నం చేస్తున్నాడని జీవీ పేర్కొన్నారు. సంస్కారవంతుడైన ఎంపీపై నోటికొచ్చినట్లు మాట్లాడరాదని హితవు పలికారు. గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.600కోట్లు విడుదల చేశారని, పట్టణానికి 160కోట్లు, గ్రామాలకు రూ 440కోట్లతో వాటర్ గ్రిడ్ పథకం ద్వారా నిధులు విడుదలైతే 20 శాతం కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తే కాంట్రాక్టర్ పనులు ఆపిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు. ప్రతి హామీ ప్రజలకు మోసమేనని, పట్టణంలో ముస్లిం మైనార్టీ కాలేజీ, 100 పడకల వైద్యశాల, ఎస్ఎస్‌పీలో రైతు బజార్ ఎక్కడని, ఇది మైనార్టీలతో పాటు, పట్టణ ప్రజలను మోసంచెయ్యడం కాదా అని నిలదీశారు. సదావర్తి పేరుతో ఆర్యవైశ్యుల నుండి డబ్బు ఖర్చు పెట్టించలేదా.. చేసిన అభివృద్ధి చూపాలన్నారు. వ్యక్తిగతంగా ఎంపీపై మక్కెన మల్లికార్జునరావుతోపాటు తనపై చేసిన విమర్శలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ భాష చూస్తే బాధేస్తోందన్నారు. చేసిన అభివృద్ధి చెప్పుకోలేకనే బూతులు తిడుతున్నారన్నారు. మొన్నటి వరకు నీవు చేసిన పనేంటని, ఒక్కసారిగా అపరకోటీశ్వరుడు ఎలా అయ్యావో చెప్పాలని నిలదీశారు. ఇప్పటికైనా బొల్లా భాష మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగశ్రీను, షమీమ్, ఆచారి, గురవయ్య, గోవిందునాయక్, బొల్లా వెంకట కోటయ్య, పెమ్మసాని నాగేశ్వరరావు, పత్తిపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని గద్దె దించడానికి ప్రజలు సహకరిస్తున్నారు

డాక్టర్ చదలవాడ అరవిందబాబు



పార్టీలో చేరినవారితో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1: జగన్‌మోహన్‌రెడ్డిని గద్దెదించడానికి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులకు ప్రజలు సహరిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో క్రిష్టియన్‌పాలెం ఐదవ వార్డు నుంచి వైసీపీ నుంచి 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఆ కుటుంబాలను డాక్టర్ చదలవాడ అరవిందబాబు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి మోసపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మద్యం, గంజాయి, ఇసుక మాఫియాతో అవినీతి, దుర్మార్గం ఎమ్మెల్యేగా నిలిచారని, ఈ 75 సంవత్సరాలలో ఏవరూ చేయనివిధంగా రూ వేయి కోట్లు సంపాదించారన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన 1504 టిడ్కో గృహాలను నిజమైన లబ్దిదారుల పేర్లు తొలగించి వైసీపీ కార్యకర్తలకు ఇచ్చారన్నారు. ఈ అరాచకాన్ని న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆపామని, రేపు అధికారంలోకి రాగానే నిజమైన లబ్దిదారులకు అందజేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే పింఛన్ల పంపిణీపై వైసీపీ రాజకీయం

రాజకీయ లబ్ధికోసమే పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ రాజకీయం చేస్తుందని టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. టీడీపీ నాయకుల వలనే పింఛన్ పంపిణీ ఆగిపోయిందని వైసీపీ నేతల దుష్ప్రచారాన్ని ఖండించారు. వైసీపీ కార్యకర్తలైన వలంటీర్లతో పింఛన్ పంపిణీ చేయడానికి టీడీపీ వ్యతిరేకించిందని, ఫించన్ పంపిణీకి వ్యతిరేకించలేదన్నారు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో సచివాలయ ఉద్యోగులు ఉంటే వారిని ఇంటింటికి పంపి ఎందుకు పింఛన్ పంపిణీ చేయలేకపోయారని నిలదీశారు. గత ఎన్నికలలో గెలుపుకోసం వివేకానంద రెడ్డికి గొడ్డలివేటు వేసి ప్రతిపక్ష నాయకుడి మీద హత్య ఆరోపణలు చేసి రాజకీయ లబ్ది పొందారన్నారు. జగన్‌రెడ్డి కుట్ర రాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారని, ఈ సారి జగన్‌రెడ్డి కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పి కొడతారన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి : ట్రైనీ డీఎస్పీ జగదీష్

● మండలంలోని మూడు గ్రామాల్లో బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసుల కవాతు



మైదవోలులో జరిగిన కవాతులో పాల్గొన్న ట్రైనీ డీఎస్పీ జగదీష్, శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్, బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసులు

యడ్లపాడు, ఏప్రిల్ 1: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ట్రైనీ డీఎస్పీ జగదీష్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం, కారుచోల, గుత్తావారిపాలెం, ఉప్పరపాలెం గ్రామాల్లో బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసులతో సోమవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లోను కావద్దని, ఎవరైనా బెదిరించినా, భయభ్రాంతులకు గురిచేసినా వెంటనే తమకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, యడ్లపాడు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్, కేంద్ర బలగాలకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్లు 84మందితోపాటు యడ్లపాడు స్టేషన్ సిబ్బంది కవాతులో పాల్గొన్నారు.



నూజెండ్ల: కంభంపాడులో కేంద్ర బలగాల కవాతు

ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

నూజెండ్ల, ఏప్రిల్ 1: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, ఎటువంటి వాగ్వాదాలు, ఘర్షణలు, రీపోలింగ్ లేకుండా ఓటర్లందరూ ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటుచేస్తున్నామని వినుకొండ రూరల్ సీఐ సుధాకరరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కంభంపాడు, పమిడిపాడు, మృతరాసువారిపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలతో గ్రామాల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి, ఐనవోలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలోకి 60 వైసీపీ కుటుంబాల చేరిక



వితంరాజుపల్లి నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ సతీమణి గోనుగుంట్ల లీలావతి, మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ, ఏప్రిల్ 1: ఈపూరు మండలం ఇనిమెళ్ళ, వినుకొండ మండలం వితంరాజుపల్లి, బొల్లాపల్లి మండలం సరిగొండపాలెం గ్రామాల నుంచి అధికార వైపీపీ నుంచి 60 కుంటుబాలు పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు, జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి గోనుగుంట్ల లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీలో చేరినవారికి ముగ్గురు నేతలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పార్టీలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, గ్రామపార్టీనాయకులు పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్, సర్పంచ్ టీడీపీలో చేరిక



ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ వార్డు కౌన్సిలర్ షేక్ జెమీలా, సర్పంచ్ మొలమద్ది సుబ్బారావు తదితరులు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 1: చిలకలూరిపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలోకి చేరికల జోరు పెరిగింది. తాజాగా సోమవారం పట్టణానికి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ షేక్ జెమీలా, యడ్లపాడు మండలం కొత్తపాలెం సర్పంచ్ మొలమద్ది సుబ్బారావు, అదే గ్రామానికి చెందిన వార్డు మెంబరు కొండబోయిన కోటయ్య వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. పట్టణంలోని ప్రత్తిపాటి నివాసంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతున్న రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేళ్ళ సుబ్బారావు, నెల్లూరి సదాశివరావు, మల్లెల రాజేష్ నాయుడు, ముక్తా వాసు, మునిసిపల్ వైస్ చైర్మన్ గోల్డ్ శ్రీను, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, జాలాది సుబ్బారావు, చెమిటిగంటి పార్వతి, రత్నారెడ్డి, పంగులూరి వెంగలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకారం

వంకాయలపాడు(యడ్లపాడు), ఏప్రిల్ 1: మండలంలోని వంకాయలపాడులో గల ఎస్టీ కమ్యూనిటీ హాలుకు శ్లాబువేసే పనులను మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు సోమవారం టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ ఎస్టీ కాలనీ వాసుల చిరకాల కోరికను ప్రత్తిపాటి పుల్లారావు ఆశీస్సులతో నేరవేరిందన్నారు. టీడీపీ అభిమాని నర్సిరెడ్డి ఆర్థిక సహకారంతో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తిచేయడం జరుగుతున్నదన్నారు. శ్లాబు నిర్మాణానికి అయ్యే ఖర్చునంతటిని నర్సిరెడ్డి భరించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు బుడే, నాయకులు ఆదం, మస్తాన్‌వలి, తోట శ్రీనివాసరావు, నాగూర్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన మనోహర్‌నాయుడు

చిలకలూరిపేట, ఏప్రిల్ 1: పట్టణంలోని 9వ వార్డు పరిధిలో ఉన్న రజక కాలనీలో సోమవారం వైసీపీ చిలకలూరిపేట అసెంబ్లీ అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు తన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తొలిరోజు ప్రచారంలో ఎంఎల్‌సీ మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి మనోహర్‌నాయుడు కరపత్రాలను పంపిణీ చేశారు. తనను ఆశీర్వదించి ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మునిసిపల్ చైర్మన్ రఫానీ, వైస్‌చైర్మన్ వలేటి వెంకటేశ్వర్లు, తలహాఖాన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మృతికి సంబంధించి కలెక్టర్‌కు వినతి

చిలకలూరిపేట, ఏప్రిల్ 1: మాచర్ల శివారులోని ఒక పాఠశాలలో స్నానంచేస్తూ విద్యార్థులు మృతి చెందిన సంఘటనకు సంబంధించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఎల్ శివశంకర్‌కు, విద్యాశాఖ ఏడీ పీ శ్రీనివాసరెడ్డికి సోమవారం గిరిజన సంఘాల నాయకులు కేతావత్ పాండు నాయక్, బీ శ్రీనునాయక్, డీ డేవిడ్, రాంబాబునాయక్‌లు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. పాఠశాల యాజమాన్యంపై కేసుల నమోదుతో పాటు పాఠశాల అనుమతులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల కుటుంబ సభ్యులకు పాఠశాల యాజమాన్యం తరుపున రూ.20లక్షలు, ప్రభుత్వం నుంచి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

కొత్తలూరులో ప్రభుత్వ బోరుకు తొలగించిన మోటర్లు

కొత్తలూరు(శావల్యాపురం), ఏప్రిల్ 1: మండలంలోని కొత్తలూరులో ప్రభుత్వ బోరుకు వైసీపీ నాయకులు అమర్చిన మోటర్లను పంచాయతీ అధికారులు ఎట్టకేలకు సోమవారం తొలగించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'ప్రభుత్వ బోరు సొంతానికి వాడకం' అన్న కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు ప్రభుత్వ బోరుకున్న మోటర్లను వెంటనే తొలగించి గ్రామస్తులకు నీటి ఎద్దడి లేకుండా ఉండేలా చేతిపంపును బిగించాలని స్థానిక పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మహేందర్ కొత్తలూరుకు వెళ్ళి బోరుకున్న సొంత మోటర్లను తొలగించారు. గ్రామస్తులంతా బోరు నీటిని వాడుకొనేలా చేతిపంపు బిగించారు.

రైస్ మిల్లులో చోరీ...లక్ష నగదు అపహరణ

నాదెండ్ల, ఏప్రిల్ 1: మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలో గల గుంటూరు-కర్నూలు రహదారి సమీపంలో ఉన్న బాయిల్డ్ రైస్ మిల్లులో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. సుమారు రూ.లక్ష నగదును అపహరించారు. ఆదివారం రాత్రి 11గంటల వరకు మిల్లు యజమాని అక్కడే ఉండి ఇంటికి వెళ్ళాడు. వాచ్‌మెన్ పక్కన ఉన్న గోడౌన్‌లో నిద్రించాడు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ప్రధాన గేటు తాళం పగలగొట్టి రైస్‌మిల్లు ఆఫీసు తాళాన్ని కోశారు. ఆఫీసులోని ఇనప పెట్టెను పగలగొట్టి దానిలో ఉన్న రూ.లక్ష నగదుతో పాటు మిల్లులో కార్మికురాలు దాచుకున్న చెవి పోగులు కూడా ఎత్తుకు వెళ్ళారు.

హోంగార్డుకు ఘన సన్మానం

నరసరావుపేట లీగల్: పదవీ విరమణ పొందిన పట్టణానికి చెందిన హోంగార్డు ఎస్‌వీ శ్రీనివాసరావును సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు,సిబ్బంది పాల్గొన్నారు.



నూజెండ్ల మానవహారంలో అధికారులు, విద్యార్థులు, సిబ్బంది

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనది

● తహసీల్దార్ సయ్యద్ నయూం అహమ్మద్

నూజెండ్ల, ఏప్రిల్ 1: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని తహసీల్దార్ నయూం అహమ్మద్ సోమవారం అన్నారు. నూజెండ్లలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది, జెడ్పీ పాఠశాల విద్యార్థులతో కలసి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగం, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడళ్ళల్లో మానవ హారంగా ఏర్పడి స్వీప్ ప్రోగ్రాంను నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో టీ వీరభద్రాచారి, ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి, ఎంఈవో-2 రవిచంద్ర, మండల సర్వేయర్ చండీరాణి, డిప్యూటీ తహసీల్దార్ ఎం అర్జున్ నాయక్, ఉపాధ్యాయులు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసం ఉమ్మడి కూటమిని గెలిపించాలి

● మాజీ ఎమ్మెల్యే జీవీ తనయుడు హరీష్‌బాబు

పిచికలపాలెం(శావల్యాపురం), ఏప్రిల్ 1: పేదల అభ్యున్నతి కోసం రానున్న ఎన్నికలలో ప్రజలంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు తనయుడు గోనుగుంట్ల హరీష్‌బాబు అన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిచికలపాలెంలో హరీష్‌బాబు, సత్యకృష్ణ దంపతులు ఇంటింటికీ తిరిగి ఉమ్మడి మ్యానిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలను గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. హరీష్‌బాబు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం జీవీ ఆంజనేయులు రానున్న ఎన్నికలలో ఉమ్మడి అభ్యర్థి జీవీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు బోడెపూడి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ గణపర్తి బుల్లబ్బాయి, గాలి నాగేశ్వరరావు, పొందూరి అంజయ్య తిరువీధి శ్రీనివాసరావు, పొందూరి బాబు, జాగర్లమూరి బ్రహ్మయ్య, చిమటా చలమయ్య, యలబోలు శివ, తిరువీధి ఆంజనేయులు, గణపర్తి అంజయ్య, మండల నాయకులు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 30 కుటుంబాలు జనసేనలో చేరిక



తిమ్మాయపాలెం నుంచి జనసేనలో చేరినవారితో నాగశ్రీను రాయల్

వినుకొండ, ఏప్రిల్ 1: మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామంలో అధికార వైసీపీ నుంచి జనసేన పార్టీ నియోజకవర్గం కన్వీనర్ నాగశ్రీను రాయల్ సమక్షంలో సోమవారం సుమారు 30 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వైసీపీ నాయకులకు జనసేన కండువ కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

వైసీపీ కోడ్ ఉల్లంఘన

● ఫ్లయింగ్ స్క్వాడ్‌చే స్టిక్కర్ల తొలగింపు

చిలకలూరిపేట, ఏప్రిల్ 1: వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణం లోని 9వ వార్డులో అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు ఎన్నికల కోడ్‌ను ఉల్లం ఘించారని సోమవారం సీ విజిల్ యాప్ ద్వారా అధికారులకు స్థానిక న్యాయ వాది మండవ వెంకటరావు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంతో పాటు ప్రతి ఇంటికి వైసీపీ స్టిక్కర్లను అంటిస్తున్న విషయాన్ని ఆయన తన ఫిర్యాదులో ఫోటోలతో సహా పేర్కొన్నారు. వెంటనే స్పందించిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఆ ప్రదేశానికి చేరుకుని వైసీపీ స్టిక్కర్లను తొలగించివేశారు.

బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాలు

యడ్లపాడు, ఏప్రిల్ 1: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాలను టీడీపీ నాయకులు నిర్వహించారు. సంగంగోపాలపురం, బున్నినగర్‌లలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు, కందిమళ్ళ రఘురామారావు, స్టీఫెన్ కరుణాకర్, మద్దూరి శ్రీనివాసరెడ్డి, ఆదిశేష పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు టీడీపీ హయాంలోనే అమలయ్యాయి

వినుకొండ, ఏప్రిల్ 1: రాజ్యాంగ హక్కులను అమలు పరచడం టీడీపీతోనే సాధ్యమని ఎంఆర్‌పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మక్కెన ప్రభాకర్ అన్నారు. స్థానిక 27వ వార్డులో ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల ఉద్యోగ, రాజకీయ ఎదుగుదలకు చంద్రబాబునాయుడు కృషి చేశారని తెలిపారు. జనసేన బీజేపీ, టీడీపీ బలపరిచిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదేవిధంగా వినుకొండలో జీవీ ఆంజనేయులును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏసుబాబు మాదిగ, మక్కెన శ్రీను, దాసరి కనకయ్య, ఏలియా, లాజర్, రాజు, మరియదాసు, వంశీ, భాస్కర్, ఐజాక్, ఇసాక్, అశోక్, శ్రీరామ్, ఆనంద్, సతీష్, అబ్రహం పాల్గొన్నారు.

చేపల చెరువు కాపలా వ్యక్తిపై వైసీపీ వర్గీయుల దాడి

వినుకొండ, ఏప్రిల్ 1: చేపల చెరువు వద్ద కాపలా కాసే టీడీపీ వ్యక్తిపై వైసీపీ సానుభూతిపరులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే నడిగడ్డ గ్రామానికి చెందిన గాడిపర్తి చిన్నవెంకయ్య సమీపంలోని చేపల చెరువు వద్ద కొంతకాలంగా కాపలాదారునిగా పనిచేస్తున్నారు. చెరువు సమీపంలో గేదెలు రానీయడంలేదని, అడ్డు తొలగించుకునే కుట్రలో భాగంగా అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన శెట్టి వెంకటేశ్వర్లు, శెట్టి బాల చెన్నయ్య కలిసి పథకం ప్రకారం టీడీపీకి చెందిన వెంకయ్యపై దాడిచేశారు. వెంకయ్య తలకు బలమైన గాయాలు తగలడంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే తాగునీటి సమస్య

శావల్యాపురం, ఏప్రిల్ 1: అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే శావల్యాపురంలో తాగునీటి సమస్య తలెత్తిందని సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల తాగునీటి చెరువులు నింపుకొనేందుకు ప్రభుత్వం సాగర్ జలాలను విడుదల చేస్తే పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గం చెరువును నింపకుండా నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. ప్రజలకు తాగునీరు అందించడంలో ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే శావల్యాపురంలో ప్రజలకు గుక్కెడు తాగునీరు లేకుండా పోయిందన్నారు. ప్రతినెలా ఒక్కో కుళాయికి రూ.100 చొప్పున వసూలు చేస్తూ వేసవి వచ్చేసరికి తాగునీరు లేదని చెప్పడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి చెరువును నింపడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

వినుకొండటౌన్, ఏప్రిల్ 1: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల ఆర్‌వో సుబ్బరావు తెలిపారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి అధికారులు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఆర్ఐ శ్రీహరి, మున్సిపల్ డీఈఈ వెంకయ్య పాల్గొన్నారు.